**కావలెను**

విశాఖ సమాచారమ్
తెలుగు దినపత్రికకు
గాజువాక, స్టీల్‌ప్లాంట్ ప్రాంతాలకు
విలేఖరులు కావలెను.
సెల్: 8247526179



VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com


# విశాఖ సమాచారమ్


Sugar Free
**Fitearly**
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.



RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 33 విశాఖపట్నం, 08 నవంబరు 2023 బుధవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00


# ప్రశాంతంగా సాగుతున్న మిజోరం అసెంబ్లీ ఎన్నికలు



● ఓటు హక్కు వినియోగించుకున్న గవర్నర్ కంభంపాటి హరిబాబు ● మిజోరంలో 72 శాతం, ఛత్తీస్‌గఢ్‌లో 63 శాతం పోలింగ్ నమోదు

ఈశాన్య రాష్ట్రం మిజోరంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది. 11 జిల్లాల వ్యాప్తంగా 40 స్థానాలకు పోలింగ్ జరుగుతోంది. మధ్యాహ్నం 4 గంట వరకు 72 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. సెర్చిప్ జిల్లాలో రికార్డు స్థాయిలో 80 శాతం పోలింగ్ నమోదు కాగా, లౌంగల్లాయ్ జిల్లాలో 69 శాతం పోలింగ్ నమోదైంది. రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి లియాంజలా వెల్లడించారు. మొత్తం 40.

ఐజ్వాల్: కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య మిజోరాంలో 40 మంది సభ్యుల అసెంబ్లీకి ఎన్నికల పోలింగ్ మంగళవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైందని అధికారులు తెలిపారు. సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. మిజోరాం అసెంబ్లీ ఎన్నికల్లో మంగళవారం మధ్యాహ్నం 4 గంట వరకు 8.57 లక్షల మంది ఓటర్లలో దాదాపు 72 శాతం మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని అధికారులు తెలిపారు.



పోలింగ్ ట్రెండ్స్ ప్రకారం, ఎన్నికల కమిషన్ డేటా ప్రకారం, పోలింగ్ ప్రారంభమైన ఆరు గంటల్లో ఓటింగ్ శాతం

(మిగతా 2లో)





పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించకూడదని ఇష్టపడే 96 ఏళ్ల అంధ ఓటరు పు జాదవ్లా విజయవంతంగా ఓటు వేశారు.(మూలం)

# సుప్రీంలో ఏపీ దొంగ ఓట్లపై కేసు



## విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్

న్యూఢిల్లీ: ఏపీ దొంగ ఓట్లపై సుప్రీం కోర్టులో మంగళవారం విచారణకు వచ్చింది. అయితే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా విచారణ నుంచి తప్పుకున్నట్లు తెలిపారు. గతంలో ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేసినందున ఈ కేసు విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ప్రకటించారు. ఏపీలో దొంగ ఓట్లపై మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్ కుమార్ ఆధ్వర్యంలోని సిటిజెన్స్ ఫర్ డెమొక్రసీ పిటీషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే ఈ కేసు విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు జస్టిస్

(మిగతా 2లో)

# ఉల్లి కోయకుండానే కన్నీళ్లొచ్చాయి



హొసూరు (చెన్నై): హొసూరు మార్కెట్‌లో ఉల్లికి మళ్లీ ధర పలుకుతోంది. నిత్యం 30 లోడ్లకు పైగా పెద్ద ఉల్లిగడ్డలు వస్తాయి. అంతేకాకుండా తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా తిరుచ్చి, దిండుకల్, విరుదునగర్, తెన్కాసీ, నెల్లై వంటి ప్రాంతాల నుంచి ఉల్లి వస్తోంది. ఇదివరకు నాణ్యమైన ఉల్లి కిలో గరిష్ఠంగా రూ.50 గా ఉండగా తాజాగా సోమవారం రైతుబజారులో కిలో రూ.100 పలికింది. రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.120 దాకా పలుకుతోంది. దీంతో సామాన్య వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు.

# కరువు సమస్యపై విన్నవించేందుకు వెళ్లడం నేరమా? : కె రామకృష్ణ



అనంతపురం, (విశాఖ సమాచారమ్): ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టపర్తి పర్యటన సందర్భంగా కరువు సమస్యపై విన్నవించేందుకు వెళ్లడం నేరమా? అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ప్రశ్నించారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలలో సీపీఐ, టీడీపీ నేతల అక్రమ అరెస్టులను ఖండించారు. రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తున్నా జగన్మోహన్ రెడ్డికి పట్టడం లేదని విమర్శించారు. కరువు సమస్యపై మాట్లాడేందుకు కూడా జగన్‌కు తీరిక లేదా? అని నిలదీశారు. అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాగా.. శ్రీసత్యసాయి జిల్లాలో సీఎం జగన్ పర్యటనను నిరసిస్తూ చలో పుట్టపర్తికి టీడీపీ పిలుపునివ్వగా.. పోలీసులు ఎక్కడికక్కడ టీడీపీ నేతలను గృహ నిర్బంధం

(మిగతా 2లో)

# డూప్లికేట్ ఓట్ల తొలగింపులో జాగురూకత వహించాలి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా డూప్లికేట్ ఓట్లను తొలగించే క్రమంలో జాగురూకత వహించాలని ఒకటికి రెండు సార్లు పరిశీలించుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ సూచించారు. ఒకే డోర్ నెంబర్లో అధిక ఓట్లు ఉన్నా.. ఒకరి పేరు మీద రెండు ఓట్లు ఉన్నా బీఎల్వోలు స్వయంగా ఆయా ఇళ్లకు వెళ్లి పరిశీలించాలని చెప్పారు. అన్ని వివరాలు సరిపోయాయి అనుకున్నాకే ఓట్లను తొలగించాలన్నారు. డూప్లికేట్ ఓట్ల తొలగింపులో సంబంధిత ఓటరు నుంచి సమ్మతి తీసుకోవాలని స్పష్టం చేశారు. చిరునామా మారినా లేదా వలస వెళ్లిపోయినా వారి వివరాలను కచ్చితంగా తెలుసుకోవాలని అనంతరం తదుపరి చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు.

ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల పరిధిలోని ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్వోలు, సూపర్ వైజర్లతో స్థానిక వీఎంఆర్డీఏ ఎరీనాలో జాయింట్ కలెక్టర్

(మిగతా 2లో)

# కాంగ్రెస్ అధికారంలో వచ్చినప్పుడల్లా.. రెచ్చిపోతున్న నక్సలైట్లు



రాయ్‌పూర్: ఛత్తీసగఢ్‌లో నక్సలిజాన్ని అరికట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడల్లా ఉగ్రవాదులు, నక్సలైట్లు ధైర్యంగా రెచ్చిపోతున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇక్కడి సూరజ్‌పూర్ జిల్లాలో నిర్వహించిన బహిరంగ సభను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా మహాదేవ్ బెట్టింగ్ యాప్ కుంభకోణాన్ని ప్రస్తావిస్తూ.. ఇక్కడి 30 శాతం కమీషన్ ప్రభుత్వం బహిరంగంగా బెట్టింగ్ నిర్వహిస్తోందంటూ ఆరోపణలు చేశారు.

'దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడల్లా.. ఉగ్రవాదులు, నక్సలైట్లు ధైర్యంతో పెట్రేగిపోయారు. బాంబు పేలుళ్లు, హత్యల వార్తలు వినిపించేవి. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉంటే.. అక్కడ నేరాలు, దోపిడీల పాలన సాగుతుంది' అని ప్రధాని మోదీ ఆరోపించారు. ఇటీవల ఛత్తీసగఢ్‌లో చోటుచేసుకున్న భాజపా నేతల హత్యలను ఉటంకిస్తూ.. స్థానికంగా నక్సల్స్ హింసాత్మక ఘటనలను కట్టడి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. 'మీరు బాంబులు, తుపాకుల నీడలో బతకాలను కుంటున్నారా? మీ దగ్గర ఎంత డబ్బు ఉన్నా ఏం లాభం..?..' అని ఓటర్లను ప్రశ్నించారు. ప్రతి ఒక్కరికీ భద్రత చాలా ముఖ్యమని.. ఈ క్రమంలోనే కాంగ్రెస్‌ను గద్దెదించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

మహాదేవ్ బెట్టింగ్ యాప్ వ్యవహారంపై సీఎం భూపేశ్ బఘేల్‌ను లక్ష్యంగా చేసుకున్న ప్రధాని మోదీ.. ఈ కుంభకోణం ఇప్పుడు దేశ విదేశాల్లో చర్చనీయాంశమైందన్నారు. రూ.500 కోట్లు లంచం ఇచ్చానని ఈ కేసులో ప్రధాన నిందితుడు మీడియాలో చెబుతున్నాడని పేర్కొన్నారు. కాంగ్రెస్ దృష్టిలో దేశంలో ఆదివాసీల ఉనికే లేదని, వారిని ఆ పార్టీ నిరక్ష్యం

(మిగతా 2లో)

# చంద్రబాబుకు హైకోర్టులో మరో ఊరట

## 22 వరకూ సీఐడీ నో యాక్షన్ !





ఏపీలో విపక్ష టీడీపీ అధినేత చంద్రబాబుకు ఇవాళ హైకోర్టులో మరో తాత్కాలిక ఊరట లభించింది. స్కిల్ కేసుతో పాటు మరిన్ని కేసుల్లో సీఐడీ నిందితుడిగా చేర్చిన నేపథ్యంలో ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించిన చంద్రబాబుకు మరో కేసులో ఊరట లభించింది. ఇప్పటికే స్కిల్ కేసులో హైకోర్టు ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన తరుణంలో ఆ గడువు ముగిసేలోపు మరో కేసులో అరెస్టు చేయబోమని సీఐడీ ఇవాళ హైకోర్టుకు హామీ ఇచ్చింది.

ఏపీ రాజధాని అమరావతిలో ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం చేపట్టిన అలైన్ మెంట్ లో మార్పులతో గత టీడీపీ ప్రభుత్వంలో సీఎంగా ఉన్న చంద్రబాబుతో పాటు మాజీ మంత్రి నారాయణ, మరికొందరు లబ్ధి పొందినట్లు సీఐడీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో చంద్రబాబును ఏ2గా పెట్టింది. ఈ నేపథ్యంలో చంద్రబాబు తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ పై విచారణ జరిపిన హైకోర్టు.. సీఐడీ అభిప్రాయం కోరింది.

దీంతో స్పందించిన సీఐడీ.. చంద్రబాబుకు ఇప్పటికే మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో ఆ గడువైన నవంబర్ 22 వరకూ ఆయన్ను అరెస్టు చేయబోమని కోర్టుకు హామీ ఇచ్చింది. దీంతో ఈ కేసు విచారణను నవంబర్ 22కు వాయిదా వేస్తూ హైకోర్టు నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత జరిగే విచారణలో తీసుకునే నిర్ణయాల ఆధారంగా చంద్రబాబు ముందస్తు బెయిల్ పై నిర్ణయం వెలువడనుంది. అప్పటివరకూ చంద్రబాబుకు ఊరట దక్కినట్లే భావించవచ్చు.

(మిగతా 2లో)

# రైతన్నలకు అండగా వై.యస్.ఆర్ రైతు భరోసా



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): వై.యస్.ఆర్ రైతు భరోసా - పి.ఎం కిసాన్ క్రింద వరుసగా ఐదవ ఏడాది.. రెండవ విడతగా ఒక్కొక్కరికి రూ.4 వేలు చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 53.53 లక్షల మంది రైతన్నలకు రూ.2,204.77 కోట్ల ఆర్థిక సాయం చేసే కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి లో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా స్థాయి కార్యక్రమం విశాఖ జిల్లా భీమిలి నియోజక వర్గం ఆనందపురం మండలం బోని గ్రామంలో మాజీ మంత్రి వర్యులు, శాసన సభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, సంయుక్త కలెక్టర్ కె.ఎస్. విశ్వనాధన్ తో కలిసి ప్రారంభించారు. ముందుగా మాజీ ముఖ్య మంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాస రావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రైతు పక్షపాతి అని కొనియాడారు. దేశంలో తొలిసారిగా సంక్షేమ క్యాలెండరును విడుదల చేసి అమలు చేస్తున్నారని, దీనికి ఎంతో చిత్తశుద్ధి ఉండాలని అన్నారు. రాష్ట్రంలో రూ.2 లక్షల 30 వేల కోట్లు కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా ప్రజలకు అందించిన ఘనత ఈ సీఎందేనని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా ఈ నాలుగేళ్లలో రూ.23 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమచేసారని చెప్పారు.

జిల్లాలోని ఏడు మండలాల్లో రైతు భరోసా క్రింద నాలుగేళ్లకు రూ.132 కోట్లు రాగా, అందులో ఈ నియోజక వర్గంలో రూ.100 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసిన ఏకైక సీఎం జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. ఈ చుట్టు ప్రక్కల గ్రామాల్లోని రైతులకు భూసమస్య ఉందని సీఎం దృష్టికి తీసుకువెళ్లగా, సానుకూలంగా స్పందించి వారికి కూడా రైతు భరోసాను అందించిన గొప్ప మనసున్న వ్యక్తి మన సీఎం అని కితాబిచ్చారు. ఉచిత విద్యుత్ క్రింద 1 కోటి 80 లక్షలను సబ్సిడీగా రైతులకు అందించడం జరిగిందని వివరించారు. చిన్న పిల్లల నుండి అవ్వా తాతల వరకు అన్ని వర్గాల వారికి ఎటువంటి వివక్షకు తావులేకుండా పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కరోనా సమయంలో రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పథకాలు నిలిపివేయలేదని, ప్రజా సంక్షేమమే పరమావధిగా ముందుకు సాగారన్నారు. ప్రభుత్వ సేవలు మన ముంగిటకే ఈ ప్రభుత్వం తీసుకువచ్చిందని, దాంతో ప్రభుత్వ సేవలు పొందడం మరింత సులభతర మైందని చెప్పారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి మధ్య గల తేడాలను ప్రజలు గమనించి మంచి చేసే ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.

సంయుక్త కలెక్టర్

(మిగతా 2లో)



# శిశు మరణాల రేటు తగ్గించటానికి అందరు సహకరించాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారి కార్యాలయ సమావేశ మందిరంనందు గౌరవ డిస్ట్రిక్ట్ సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీమతి వెంకట శేషమ్మ వారి అధ్యక్షతన డా.పి.జగదీశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారి సమక్షంలో జిల్లాలో గల గవర్నమెంట్ ఆసుపత్రులు KGH, VGH మరియు ప్రైవేటు ఆసుపత్రుల గైనకాలజిస్టు, పిడియాట్రిక్స్ స్పెషలిస్ట్ డాక్టర్స్ కు శిశు సంరక్షణ దినోత్సవ సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశాన్ని ఉద్దేశించి డా.పి.జగదీశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారు మాట్లాడుతూ శిశు సంరక్షణ దినోత్సవం యూరోప్ లో 1990 మొదట్లో శిశు మరణాల రేటు తగ్గించటానికి చర్యలు తీసుకోవడంలో, అవగాహన కల్పించేందుకు నవంబర్ 07 వ తేదిన శిశు సంరక్షణ దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించారు. తర్వాత అమెరికా, మిగతా దేశాలు కూడా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయి. నవజాత శిశువు లలో రోగ నిరోధక శక్తిని పెంపొందించటానికి, శిశు మరణాల రేటు తగ్గించటానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో అవగాహన కల్పించటమే దీని ముఖ్యోద్దేశ్యం అని తెలియచేసారు.

తదుపరి డా.ఎం.ఎస్.రాజు, HOD, పిడియాట్రిక్స్, కేజీహెచ్ వారు మాట్లాడుతూ చిన్నారులలో కలిగే చిన్న చిన్న వ్యాదులను తల్లి గుర్తించి వైద్యం చేయించాలని మరియు బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలు త్రాగించాలని తెలియచేశారు. తదుపరి డా.షర్మిల, గైనకాలజిస్ట్, కేజీహెచ్ వారు మాట్లాడుతూ శిశువు ఆరోగ్యంగా ఉండాలంటే తల్లి ఆరోగ్యంగా ఉండాలి. పిల్లలకు తల్లిపాలు తప్పనిసరిగా పట్టించాలని తల్లి గర్భిణీ గా ఉన్నప్పుడే బలవర్థకమైన ఆహారం తీసుకోవాలని బర్త్ ప్లానింగ్ గురించి ముందుగానే ప్రిపేర్ అవ్వాలని తెలియచేశారు.

తదుపరి శ్రీమతి పి.వెంకటేశ్వరి, ప్రాజెక్ట్ డైరెక్టర్, ICDS, వారు మాట్లాడుతూ శిశు సంరక్షణ అనేది తల్లిదండ్రుల మీద ఆధారపడి ఉంటుందని మరియు శిశువు కు తల్లిపాలే కాకుండా వీనింగ్ ఫుడ్ కూడా అందించడం ద్వారా శిశువు ఎదుగుదల ఆరోగ్యంగా ఉంటుందని తెలియచేశారు.

తదుపరి డా.ఎస్.జీవనరాణి, DIO వారు మాట్లాడుతూ చంటిపిల్లలలో సమయాను కూలం బట్టి వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని మరియు ప్రస్తుతం IMR రేట్ (శిశు మరణాల రేటు) మనజిల్లాలో అక్టోబర్ నాటికి 4.98 ఉందని రాష్ట్రం తో పోల్చుకుంటే ఆంధ్ర రాష్ట్రానికి 10 గా ఉందని, MMR రేట్ (మాతృ మరణాల రేటు) మన జిల్లాలో అక్టోబర్ నాటికి 78.7 ఉందని, ఇది తగ్గించుకొనుట వలన శిశు రక్షణ పెరుగుతుందని, అనేక అవగాహన సమావేశాల ద్వారా తెలియచేస్తున్నామని తెలియచేశారు.

తదుపరి డిస్ట్రిక్ట్ సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీమతి వెంకట శేషమ్మ వారు మాట్లాడుతూ శిశు సంరక్షణ దినోత్సవం ప్రతి సంవత్సరం నవంబర్ 07 న జరుపుకుంటున్నామని తెలియచేశారు. మరియు పేషెంట్స్ యొక్క రక్షణ చట్టాలు కోసం మరియు PC&PNDT Act గురించి మరియు కన్స్యూమర్ ప్రొటెక్షన్ చట్టం గురించి మరియు లేబర్ రూమ్ లో బయో మెడికల్ వేస్ట్ గురించి ఆసుపత్రుల వారందరికి అవగాహన కల్పించారు. పేషెంట్ రిపోర్ట్స్, స్టోరేజ్ గురించి, మెడికల్ నెగ్లిజెన్స్ గురించి చట్టంలో గల విషయాలను, CCTV ఫుటేజ్, బర్నింగ్ ఇంజురీస్, RMO విధులు, MLC కేసులు గురించి పలు చట్టాలు గురించి డాక్టర్స్ అందరికి వివరించి అవగాహన కలుగచేసారు.

ఈ సమావేశంలో డా.బి.ఉమావతి, జిల్లా నోడల్ అధికారి, శ్రీ బి.నాగేశ్వర రావు డెమో, డా.పి.చక్రవర్తి, పిడియాట్రిక్స్ ప్రొఫెసర్, డా.శరణ్య, గైనకాలజిస్ట్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఐ.మనోరమ, DPHNO, శ్రీ.బి.నాగభూషణం, MPHEO, పలు ప్రైవేటు ఆసుపత్రుల గైనకాలజిస్టు, పిడియాట్రిక్స్ పాల్గొన్నారు.

బుధవారం 08-11-2023
శోభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయణం శరదృతువు
ఆశ్వయుజ మాసం

పంచాంగం

తిథి : బ. ఏకాదశి ఉ. 09.27
నక్షత్రం : ఉత్తర రా. 09.25
వర్జ్యం : లేదు

## సమన్వయంతో పని చేయండి



**చోడవరం, (విశాఖ సమాచారమ్):** చోడవరం గౌరీపట్నం నాయకులతో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మంగళవారం ముఖాముఖి సమావేశం నిర్వహించారు. గౌరీపట్నం గ్రామంలో నాయకులను పెద్దలను సమన్వయం చేశారు. చోడవరం నియోజవర్గంలో నేను ఎమ్మెల్యేగా గెలిచి జగనన్న ముఖ్యమంత్రి అయితేనే గ్రామంలో మీకు గౌరవం ఉంటుందన్నారు. గౌరీపట్నం నాయకులు పెద్దలు మాట్లాడుతూ గత ఎన్నికల కన్న వచ్చే ఎన్నికల్లో రెట్టింపు మెజార్టీ ఇస్తామని ముక్తకంఠంతో హామీ ఇచ్చారు.

# రూ.70.76 కోట్ల రైతు భరోసా సాయం జమ



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** రైతులు ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా సాయాన్ని సక్రమంగా వ్యవసాయ పెట్టుబడులకు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి అనంతపురం జిల్లా పుట్టపర్తి నుండి ఐదవ ఏడాది, రెండవ విడత రైతు భరోసా పంపిణీ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని మంగళవారం స్థానికి కాఫీ హౌస్ నుండి వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1 లక్ష 70 వేల 835 మంది రైతులకు రూ. 70.76 కోట్ల రైతు భరోసాను నేరుగా రైతుల ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. అటవీ హక్కుపత్రాలు కలిగిన రైతులకు రైతు భరోసా వస్తున్నది లేనిది రైతులను అడిగి తెలుసుకున్నారు. కాఫీ రైతులతో మాట్లాడి ఈ ఏడాది కాఫీని ఎంతకు విక్రయిస్తున్నారని ప్రశ్నించారు. దళారులకు విక్రయించ కూడదని జి.సి.సి. మరియు చింతపల్లి మాక్స్ సొసైటీకి కాఫీని విక్రయించాలని సూచించారు.

**రాగులు కిలో రూ.38.40 పైసలు మద్దతు ధర**

రాగులకు కిలో కు రూ.38.40 పైసలు మద్దతు ధరను ప్రభుత్వ ప్రకటించిందని చెప్పారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాల వద్ద కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. రైతులు రాగులను పౌర సరఫరాల శాఖకు విక్రయించాలని సూచించారు. పౌర సరఫరాల శాఖ తూకంలో కచ్చితత్వం ఉంటుందని చెప్పారు. దళారులకు విక్రయిస్తే మోసగిస్తారని చెప్పారు. షావుకారులకు విక్రయించి మోసపోవద్దని రైతులకు సూచించారు.

అనంతరం రైతులకు రైతు భరోసా నమూనా చెక్కును పంపిణీ చేసారు.

ఆ తరువాత పట్టు పరిశ్రమ శాఖ, పశు సంవర్ధక శాఖ, వ్యవసాయ శాఖ, ఉద్యాన వన శాఖ, స్పైసెస్ బోర్డు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్సును సందర్శించారు. పట్టు పురుగులు పెంపకం ద్వారా రైతులకు మంచి లాభాలు వస్తున్నాయని చెప్పారు. పశు సంవర్ధక శాఖ ద్వారా గిరిజన రైతులకు అందిస్తున్న సేవలకు అడిగి తెలుసుకున్నారు. పశు సంవర్ధక సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి సేవలు అందించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్.నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి ఎ.రమేష్ కుమార్ రావు, పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు నరసింహం, జిల్లా సెరికల్చర్ అధికారి అప్పారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షురాలు మినుముల సరస్వతి, పాడేరు ఎంపిపి ఎస్. రత్నకుమారి, వ్యవ సాయ సలహా మండలి సభ్యులు కన్నాపాత్రుడు, మాజీ ఎంపిపి మంగ్లన్న దొర, సర్పంచుల పోరం అధ్యక్షలు చిట్టబాబు మార్కెట్ కమిటీ అధ్యక్షులు పి. సూరిబాబు, పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, పెదబయలు మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందంతో గవర్నర్ శ్రీ షేక్ అబ్దుల్ నజీర్



**విజయవాడ, (విశాఖ సమాచారమ్):** భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసిన పాఠశాల విద్యాశాఖ కమీషనర్ ఎస్.సురేష్ కుమార్.

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 74వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ షేక్ అబ్దుల్ నజీర్‌ని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి, గవర్నర్‌కి ఫ్లాగ్ డే స్టిక్కర్ బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చేపడుతున్న సేవా కార్యక్రమాల గురించి, ఆవిర్భావ దినోత్సవ ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కు ఇచ్చే రాష్ట్రస్థాయి ఉన్నత సర్టిఫికెట్ 'రాజ్య పురస్కార్' ను ఉత్తీర్ణత సాధించిన5 గురు విద్యార్థులకు, ఇద్దరి గైడ్ లకు గవర్నర్ గారు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కోఆర్డినేషన్ శ్రీమతి పి. పార్వతి గారు, రాష్ట్ర కార్యదర్శి శ్రీ జి. భాను మూర్తి రాజు గారు, కోశాధికారి శ్రీ ఎన్. శ్రీనివాసరావు, SOC పి శ్రీనివాసరావు, రజియా బేగం, శిక్షణ నిర్వాహకులు ఎం మోహన్ రావు, ఎన్ ఉమాదేవి గారు తదితరులు పాల్గొని గవర్నర్ గారికి శుభాకాంక్షలు తెలియపరిచారు.

'రాష్ట్ర వ్యాప్తంగా 20,800 మంది పిల్లల సమిష్టి నమోదుతో 650 క్రియాశీల భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉన్నాయని తెలిపారు. రాష్ట్రపతి అవార్డును పొందేందుకుగానూ కృషిలో భాగంగా ఈ విద్యార్థులు అక్షరాస్యత, నీటి సంరక్షణ, ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ స్థిరత్వం వంటి కీలకమైన అంశాలపై సేవాకార్యకలాపాలు చేస్తున్నారని, తద్వారా 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు దోహదపడుతుందని' ఈ సందర్భంగా గవర్నర్ శ్రీ షేక్ అబ్దుల్ నజీర్ గారికి కమీషనర్ శ్రీ ఎస్.సురేష్ కుమార్ గారు వివరించారు. గుంటూరు జిల్లాలో 231 స్కౌట్స్ మరియు గైడ్స్ చురుగ్గా పాల్గొన్న రీజనల్ లెవల్ పెట్రోల్ లీడర్స్ జాంబోరెట్‌ని ఇటీవల విజయవంతంగా నిర్వహించారని తెలిపారు.

(మొదటి పేజీ తరువాయిలు)

## ప్రశాంతంగా సాగుతున్న మిజోరం అసెంబ్లీ ఎన్నికలు

52.73గా నమోదైంది. 11 జిల్లాలలో, సెర్చిప్‌లో అత్యధికంగా 70.37 పోలింగ్ శాతం నమోదైంది, తర్వాత ఖౌజాల్‌లో 60.20, లాంగ్ట్లైలో 59.31 మధ్యాహ్నం 1 గంటల వరకు పోలింగ్ శాతం నమోదైంది.

174 మంది అభ్యర్థుల ఎన్నికల భవితవ్యాన్ని నిర్ణయించడానికి 4.39 లక్షల మంది మహిళలతో సహా 8.57 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి అర్హులు.

అధికార మిజో నేషనల్ ఫ్రంట్ ప్రధాన ప్రతిపక్షం జోరామ్ పీపుల్స్ మూవ్‌మెంట్ మరియు కాంగ్రెస్ మొత్తం 40 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టాయి.

బీజేపీ 23 నియోజకవర్గాల్లో పోటీ చేస్తుండగా, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్లలో అభ్యర్థులను ప్రతిపాదించింది. వీరితో పాటు 27 మంది స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు.

ఐజ్వాల్‌లోని ఓ పోలింగ్ స్టేషన్‌లో ముఖ్యమంత్రి జోరమ్‌తంగా తన ఓటుహక్కును వినియోగించుకునేందుకు వెళ్లిన ఈవీఎంలో సాంకేతిక లోపాలు తలెత్తాయని మరో అధికారి తెలిపారు.

"సీఎం ఉదయం రామ్‌లున్ వెంగ్లాయ్ ప్రైమరీ స్కూల్ పోలింగ్ స్టేషన్‌కు వెళ్లారు, కానీ ఆ సమయంలో ఈవీఎం పని చేయలేదు. కాబట్టి, అతను ఇంటికి తిరిగి వెళ్లి 9. 40 గంటలకు తన ఓటు హక్కును వినియోగించుకోవడానికి మళ్లీ వచ్చాడు" అని అధికారి తెలిపారు. జోడించారు.

రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు లాల్‌సవత కూడా తన ఐజ్వాల్ వెస్ట్-III నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్‌లో ఉదయం 7.40 గంటలకు ఓటు వేశారు. మిజోరం అంతటా ఉన్న 1,276 పోలింగ్ స్టేషన్‌లలో 149 రిమోట్ ఓటింగ్ కేంద్రాలు మరియు అంతర్ రాష్ట్ర మరియు అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి ఉన్న 30 కీలకమైనవి మరియు దుర్బలమైనవిగా ప్రకటించబడ్డాయి.ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 7,200 మంది సిబ్బందితో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.అసెంబ్లీ నియోజకవర్గాల పోలింగ్‌కు ముందు మయన్మార్‌తో 510 కిలోమీటర్ల పొడవైన అంతర్జాతీయ సరిహద్దు మరియు బంగ్లాదేశ్‌తో 318 కిలోమీటర్ల సరిహద్దును మూసివేశారు.డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరగనుంది. అంతకుముందు 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 81.61 శాతం ఓటింగ్ నమోదైంది. MNF 40 స్థానాల్లో 26 గెలుచుకుంది, తరువాత జరిగిన ఉపఎన్నికలలో మరో రెండు స్థానాలను గెలుచుకుంది, ప్రతిపక్ష ZPM ఎనిమిది నియోజకవర్గాలను గెలుచుకుంది, ఐదు అసెంబ్లీ సెగ్మెంట్‌లను గెలుచుకున్న కాంగ్రెస్‌ను మూడవ స్థానానికి తగ్గించింది. క్రైస్తవులు అధికంగా ఉన్న ఈ రాష్ట్రంలో బీజేపీ ఒక్క సీటుతో తన ఖాతా తెరిచింది.

ఇదిలా ఉండగా, నాగాలాండ్‌లోని మోన్ జిల్లాలోని తాపీ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నిక పోలింగ్ సజావుగా సాగుతోంది, మంగళవారం ఉదయం 11 గంటల వరకు 15,000 మంది ఓటర్లలో 60 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని అధికారి ఒకరు తెలిపారు.

**ఓటు హక్కు వినియోగించుకున్న మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు**

మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొద్దిసేపటి కిందటే రాజధాని ఐజ్వాల్‌లో ఆయన ఓటు వేశారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో పోలింగ్ ప్రక్రియను అతిపెద్ద పండగగా అభివర్ణించారు. ఈ పండగలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మిజోరం అక్షరాస్యత అధికంగా ఉన్న ఉన్న రాష్ట్రం అని, తమ హక్కులపై ప్రజలకు స్పష్టమైన అవగాహన ఉందని అన్నారు. మిజోరాం ప్రజలందరూ ఓటు వేసి ఎన్నికల్లో పాల్గొనాలని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని కోరారు. ఓటింగ్ శాతం అధికంగా ఉంటుందని భావిస్తున్నట్లు చెప్పారు.

## సుప్రీంలో ఏపీ దొంగ ఓట్లపై కేసు

ప్రశాంత్ కుమార్ మిశ్రా ప్రకటించారు. దీంతో సీజేఐ ఆదేశాలతో మరో ధర్మాసనం ముందు లిస్ట్ చేయాలని రిజిస్ట్రీకి జస్టిస్ బీఆర్ గవాయి సూచించారు.

ఓటర్ల నమోదులో ఏపీ ప్రభుత్వం యదేచ్ఛగా జోక్యం చేసుకుంటోదంటూ సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ పిటీషన్‌లో పేర్కొంది. ఐప్యాక్ మాజీ ఉద్యోగుల చేత దొంగ ఓట్లు చేర్చుతున్నారని ప్రధానంగా పిటీషన్‌లో నిమ్మగడ్డ ఆరోపించారు. ర్యామ్ ఇన్ఫో లిమిటెడ్, ఉపాధి టెక్నో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, మ్యాక్ డిటెక్టివ్ అండ్ గార్డింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు వాలంటీర్ల ద్వారా సేకరించిన డేటాను ప్రొఫైలింగ్ చేస్తున్నాయని పిటీషన్‌లో పేర్కొన్నారు. ఈ సంస్థలకు రూ.68 కోట్లు ప్రజాధనాన్ని ధారపోసినట్లు పిటీషన్‌లో నిమ్మగడ్డ తెలిపారు. ఐ ప్యాక్ మాజీ ఉద్యోగుల నిర్వాకాన్ని పిటీషన్‌లో నిమ్మగడ్డ బట్టబయలు చేశారు. ఓటర్ల నమోదులో గ్రామ, వార్డు వాలంటీర్లు, కార్యదర్శులను భాగస్వాములను చేయడంపైనా సిటిజెన్స్ ఫర్ డెమొక్రసీ అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది.

## కరువు సమస్యపై విన్నవించేందుకు వెళ్లడం నేరమా? : కె రామకృష్ణ

చేశారు. మాజీ మంత్రులు కాల్వ శ్రీనివాసులు , పల్లె రఘునాథరెడ్డి , మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారధి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పోలీసుల అదుపులో ఉన్నారు. మడకశిర నుంచి పోలీసు వాహనాల్లో తరలించి ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నేతలను పోలీసులు నిర్బంధించారు. పోలీసుల తీరుపై టీడీపీ శ్రేణులు మండిపడుతున్నారు.

## డూప్లికేట్ ఓట్ల తొలగింపులో జాగురూకత వహించాలి

మంగళవారం ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్ ప్రకారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు అంశాలపై ఆరా తీశారు. ఓటర్ల జాబితా సవరణలో, డూప్లికేట్ ఓట్ల తొలగింపులో అనుసరించాల్సిన నియమ నిబంధనల గురించి వివరించారు. ఎన్నికల కమిషన్ నియమావళిని అందరూ తప్పకుండా జాబితా రూపకల్పనలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. చిన్న తప్పు కూడా లేకుండా అత్యంత పారదర్శకతతో కూడిన తుది ఓటర్ల జాబితాను ప్రచురించేందుకు అందరూ కృషి చేయాలని జేసీ పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో మనసు పెట్టి పని చేయాలని, ప్రతి అంశంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, మంచి ప్రగతి కనబరచాలని హితవు పలికారు.

సమావేశంలో డీఆర్వో కె. మోహన్ కుమార్, ప్రత్యేక ఉప కలెక్టర్లు, తహశీల్దార్లు, బీఎల్వోలు, సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అధికారంలో వచ్చినప్పుడల్లా.. రెచ్చిపోతున్న నక్సలైట్లు

చేసిందని విమర్శించారు. ఆదివాసీల సంక్షేమం భాజపా ప్రాధాన్యమన్నారు. ఒక ఆదివాసీ మహిళ (ద్రౌపది ముర్ము) భారత రాష్ట్రపతి అవుతారని ఎవరైనా అనుకున్నారా? అని అడిగారు. ఇదిలా ఉండగా.. ఛత్తీస్‌గఢ్‌లోని మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకుగానూ తొలి దశలో భాగంగా నేడు 20 స్థానాలకు పోలింగ్ జరుగుతోంది.

## చంద్రబాబుకు హైకోర్టులో మరో ఊరట

వాస్తవానికి చంద్రబాబుపై దాఖలైన స్కిల్ కేసులో మధ్యంతర బెయిల్ లభించినా, ఫైబర్ నెట్ స్కాం, మద్యం, ఇసుక అక్రమాల కేసుల్లో ఆయన్ను 22 వ తేదీ వరకూ అరెస్టు చేయబోమని ఇప్పటికే హైకోర్టుకు సీఐడీ హామీ ఇచ్చింది. ఇప్పుడు అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులోనూ అదే వాదన వినిపించింది. దీంతో నవంబర్ 22 వరకూ చంద్రబాబుకు దాదాపు అన్ని కేసుల్లోనూ ఊరట లభించినట్లే భావించవచ్చు.

## రైతన్నలకు అండగా వై.యస్.ఆర్ రైతు భరోసా

కె.ఎస్. విశ్వనాధన్ మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్ రైతు భరోసా - పిఎం కిసాన్ క్రింద వరుసగా ఐదో ఏడాదిలో రూ.32.76 కోట్ల నిధులను జమచేసినట్లు చెప్పారు. తద్వారా 28,449 మంది రైతు కుటుంబాలకు లబ్ది చేకూరిందని, రెండువ విడతలో రూ.11.82 కోట్లు రైతుల ఖాతాల్లో నేరుగా జమ కానున్నట్లు పేర్కొన్నారు. భీమిలి నియోజక వర్గంలో రెండవ విడతగా 23,143 మంది రైతు కుటుంబాలకు ఈ పథకం క్రింద రూ.9.65 కోట్లు లబ్ది చేకూరనుందని వివరించారు. బోని,శిర్లపాలెం, నారాయణ రాజుపేట గ్రామాల్లో భూ సమస్యల కారణంగా సర్వే పూర్తికాలేదని, రైతుల సహకారంతో ఈ వారంలో పూర్తవుతుందని తెలిపారు. వచ్చే రైతు భరోసా నిధులు పంపిణీ సమయానికి రైతులకు7 పట్టాలు కూడా మంజూరవుతాయని హామీ ఇచ్చారు.అలాగే 90 రోజుల్లో గృహ పట్టాలు కోసం గ్రామస్తులు దరఖాస్తు చేసుకున్నారని, వాటిలో కొందరికి మంజూరుకాగా, మిగిలినవి పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం అనంతరం జిల్లాలో లబ్ది పొందిన 28,449 మంది రైతులకు రూ.11.82 కోట్ల రూపాయల నమూనా చెక్కును ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, సంయుక్త కలెక్టర్ కె.ఎస్. విశ్వనాధన్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి రైతులకు అందజేశారు.

ఈ సందర్భంగా వివిధ పంటల సాగులో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఉత్తమ రైతులు నెల్లిమర్ల ప్రకాష్, సైలాడ గౌరిబాబు, కాళ్ళ సన్యాసిరావు, దొంతల వెంకటరమణ, మద్దిల తాటినాయుడులకు శాసన సభ్యులు, సంయుక్త కలెక్టర్ తో కలిసి దుస్సాలువతో సత్కరించి జ్ఞాపికలను అందించారు.

ఈ కార్యక్రమంలో భీమిలి రెవిన్యూ డివిజనల్ అధికారి భాస్కర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.అప్పల స్వామి, బోని సర్పంచ్ బోని అప్పల కొండ, ఆనందపురం, పద్మనాభం ఎం.పి.పిలు మజ్జి శారద,రాంబాబు,డిసిసిబి చైర్మన్ కోలా గురువులు,భీమిలి ఏఎంసి చైర్మన్ బోని అప్పల నాయుడు,మండల వ్యవసాయ పరపతి సంఘాల చైర్మన్లు,జెడ్పిటిసిలు,ఎంపిటిసిలు,సర్పంచులు,మండల అధికారులు, వ్యవసాయ అధికారులు, సచివాలయ సిబ్బంది, అధిక సంఖ్యలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ సమాచారమ్

బుధవారం 08-11-2023


## అహం నశిస్తే, ఆత్మ ప్రకాశిస్తుంది

మూడు విధాలు. 'అహం' వేరు... 'అహంకారం' వేరు. 'అహం' అనే సంస్కృత పదానికి తెలుగులో 'నేను' అని అర్థం. మరి ఆ 'అహం' వచ్చి 'ఆకారం'తో చేరితే... అది "అహంకారం" అనబడుతుంది. అహం రావడం ఏంటి? ఆకారంతో వచ్చి చేరడం ఏంటన్న ప్రశ్న పడవచ్చు. అంటే అర్థం.... 'నేను' అనేది ఒక భావన. నా యొక్క ఉనికికి 'నేను' అని పేరు. ఉన్నది ఉన్నట్లుగా చెప్పాలంటే, నా యదార్థ అస్తిత్వమే నేనన్నమాట. ఈ నేను అనుదానికి ఎట్టి ఆకారము లేదు. అది నిరాకార స్వరూపం. ఇది దేని యొక్క ఆధారం లేకుండా తనకు తానుగా వున్నప్పటికీ, 'నేను' అనునది ఈ సర్వానికీ ఆధారంగా వున్నదని తెలియక, ఏదో ఒక ఆకారమే నేను అని, ఈ 'నేను'ను పరిమితం చేయడమే 'అహంకారం' అంటే. అంటే ఏ ఆకారం లేకుండా అపరిమితంగా, అనంతంగా, తనకు తానుగా వున్న 'నేను'ని.... పరిమితమైన, ఖండమైన, వ్యయం చెందేటువంటి శరీర, ప్రాణ, మనో, బుద్ధులకు ఆపాదించడమనేది ఒక రకంగా అహంకారం అనబడుతుంది. కాగా వేదాంతంలో 'అంతఃకరణ చతుష్టయం'గా చెప్పబడే మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములలో నాలుగవది ఇది.

ఈ శరీర ప్రాణ మనో బుద్ధుల సంఘాతాన్ని కలిపి ఉపాధి అంటారు. శరీరాన్ని స్థూల ఉపాధి అని, ప్రాణ మనో బుద్ధులను కలిపి సూక్ష్మ ఉపాధిగా చెబుతుంటారు. అయితే... ఏ ఉపాధిని నేను అని భావించినా అది 'అహంకారం' క్రిందకే వస్తుంది. 'యద్భావం తద్భవతి' అంటే అర్థం ఇదే. 'ఎవరెట్లు భావిస్తారో, వారిని అట్లే బంధిస్తుంది'. 'శరీరమే నేను' అని అనుకునే వారికి జనన మరణాల చేత, ప్రాణమే నేను అనుకునేవారికి ఆకలి దప్పులు, 'మనసే నేను' అని భావించే వారికి శోక, మోహాలు ఇలా ఒక్కో ఉపాధి నేనుకు ఒక్కొక్క రకమైన పరిమితి వుందన్నమాట. అంచేత ఉపాధి సంగత్వం (ఉపాధి నేను అనే భావం) లేని మహనీయులను నిరహంకారులుగా పిలువబడుతారు.

ఇప్పుడు ఇది ఎన్ని విధాలుగా వుంటుందో గమనిద్దాము.

1. తమో గుణ అహం, 2. రజోగుణ అహం, 3. సత్వగుణ అహం అని అహాన్ని మూడు విధాలుగా చెప్పుకోవచ్చు.

తమోగుణ అహం అంటే... "నాకు నచ్చినట్లే జరగాలి, అంతా నా ఇష్టం, నాకు తోచినట్లు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తాను...." అనేవిధమైన వైఖరి కలిగినది తమోగుణ అహం అన్నమాట. ఒక్క మాటలో చెప్పాలంటే దీనినే రాక్షస ప్రవృత్తి అనవచ్చు. తమ అహం చాటుకోవడానికి, నిలుపుకోవడానికి విధ్వంసకరమైన, హింసతో కూడిన, పచ్చి స్వార్థంతో ప్రవర్తించడానికి, ఆ విధమైన కార్యకలాపాలు చేయడానికి ఈ అహమే మూలకారణం.

రజోగుణ అహం అంటే... ఈ అహం వున్నవారిలో కూడా స్వార్థం వుంటుంది కానీ అది పూర్వం మాదిరి నెగిటివ్ గానే వుండాలని లేదు. ఈ రజోగుణ అహం వున్నవారు కూడా కాస్తంత మధ్యస్త వైఖరి కలిగి వుంటారు. అంటే తమకు అనుకూలంగా వున్నవాటిని అందలమెక్కిస్తారు, ప్రతికూలమనిపిస్తే కూలదూస్తారు. ఈ అహం ప్రభావం చేత.... తమ అహాన్ని చాటుకునేందుకు లోకహిత కార్యక్రమాలను సైతం పెద్ద ఎత్తున నిర్వహిస్తుంటారు. అటు దైవీ లక్షణాలను, ఇటు అసురీ లక్షణాలను తమకు అనుకూలమైన విధంగా వ్యక్తపరచటం ఈ రజోగుణ అహంతో వున్నవారి నైజం.

ఇక మిగిలినది సత్వగుణ అహం. అసలు సత్వగుణాన్నే 'బంగారు సంకెళ్ళు' అని అభివర్ణిస్తుంటారు. అయితే మిగితా రెండు అహాలకంటే ఇది కాస్తంత మెరుగు, ఇంకా శ్రేయోదాయకమైనది కూడా. సత్వగుణ అహం అనేది మానవుని యందు దైవీ లక్షణాలైన ప్రేమ, దయ, కరుణ, శాంతి, సహనం, క్షణ వంటివి పెంపొందేలా చేసుకుని... తదనుగుణమైన విధంగా జీవనశైలిని అవలంబించేలా, పుణ్యాభిలాషను, జ్ఞానాభిలాషణతో కూడిన వర్తనం ఈ రకమైన అహం వున్నవారిలో కనిపిస్తుంది.

అయితే ఇక్కడ మనం గమనించవలసిన అంశం ఏంటంటే గాంధీ గారు చెప్పినట్లు, "అహం నశిస్తే, ఆత్మప్రకాశిస్తుంది". ఈ వాక్యం కేవలం లౌకికంగా మాత్రమే కాదు, ఆధ్యాత్మికంగా కూడా అక్షర సత్యం. మానవులు పెద్దలను ఆశ్రయించి, వారి బోధలను అనుసరిస్తూ జీవనాన్ని సాగించుట ద్వారా, క్రమంగా భక్తి భావంతో మెలగి, క్రమంగా తమయందలి భక్తి భావాన్ని, దైవీ లక్షణాలను వృద్ధి చేసుకుని... క్రమంగా సాధకులుగా పరివర్తన చెంది, ఆపై అను నిత్యం స్వాధ్యాయం చేయాలి. 'నేను ఇప్పుడు ఏ నేనుగా వున్నాను?' 'నాలో ఇప్పుడు ఏ అహం పనిచేస్తుంది?' 'ఇవాళ ఫలానా పనిలో నేను వ్యవహరించిన తీరు, నాలోని ఏ అహాన్ని ప్రతిబింబిస్తుంది?' అంటూ విచారణ చేస్తూ, స్వ అధ్యయనం చేయాలి. దీనినే 'ఆత్మ విమర్శ' అంటారు.

ఇలా చేసినప్పుడు, వ్యవహారాన్ని క్షుణ్ణంగా పరిశీలించుట చేత, ఏ అహం యొక్క వ్యక్తత అలా పనిగా మారినదో తెలుస్తుంది మొదట. అలా తెలిసిన తరువాత ఏ అహంతో వున్నప్పుడు ఆ పని సజావుగా జరిగింది? ఇదే పనిని తమస్సుతో కాక సత్వంతో చేస్తే, తేడా ఏం కనిపించింది? అంటూ... విచారణను వృద్ధి చేస్తే... క్రమంగా మనకు ఏ అహం ఎప్పుడు ఎలా పనిచేస్తున్నదనేది స్పష్టంగా తెలియడంతో పాటుగా... రజో తమో అహాలను నిరసిస్తూ... సత్వగుణ అహంతో వ్యవహారం నడుపుతూ... అంతర్యంలో అభావంగా వుంటూ... వ్యష్టి చైతన్యమైన 'జ్ఞాత' వుండే అవకాశం లభిస్తుంది.

అలా వ్యష్టి చైతన్య స్థితిలో నిలిచిన సాధకుడు, సర్వకాల సర్వావస్థలలోనూ తన స్థితిని నిలుపుకున్నట్లయితే సమిష్టి చైతన్యంలోకి అడుగిడి 'బ్రహ్మ స్థితి'ని అందుకోగలుగుతాడు. అప్పుడు అతడు అఖండ అద్వయ స్వరూపమే తానుగా నిలుస్తాడు. ఆ అనుభూతితో వ్యవహారంలోకి వస్తుండడం చేత, వ్యవహారం అతడిని ఎన్నటికీ బాధించదు.


**దక్షిణ మధ్య రైల్వే**

దక్షిణ మధ్య రైల్వే యొక్క టెండరు నోటీసులలోని వివరములు మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.in నందు కూడా చూడవచ్చును.

**నెం.బి/సి.79/సిఎటిజి./ఈ-ఆక్షన్/2023 తేది: 03/11/2023**
**ఈ-ఆక్షన్ నోటీస్ నెం. బిజెడ్ఎ-సిఎటిజి-02-2023**

PUB/1224

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ యందు స్పెషల్ మైనర్ యూనిట్లు (ఎస్ఎంయులు) మరియు జనరల్ మైనర్ యూనిట్లు (జిఎంయులు) స్థాపించి నిర్వహించుట కొరకు ఫుడ్ మరియు కేటరింగ్ సర్వీస్ ప్రొవైడర్ల నుండి "కేటరింగ్ సర్వీసులు ఏర్పాటు చేయుట కొరకు" ఈ-వేలం ద్వారా ఐఆర్ఈపీఎస్ యొక్క www.ireps.gov.in యొక్క ఈ-ఆక్షన్ లీజింగ్ మాడ్యూల్ ద్వారా ఈ-టెండర్లు ఆహ్వానించుచున్నారు. ఈ-వేలం షెడ్యూలు దిగువ ఈయ బడినది. వేలం నందు ఒసగబడు అస్తుల వివరములు ఐఆర్ఈపీఎస్ వెబ్‌సైట్ నందు చూడవచ్చును.

| కాంట్రాక్టు తరహా | వేలం యందు ఒసగబడు లాట్‌ల సంఖ్య | వేలం షెడ్యూల్ తేది మరియు తెరచు సమయం |
|---|---|---|
| కేటరింగ్ | స్పెషల్ మైనర్ యూనిట్లు (ఎస్ఎంయులు) జీడీఆర్, ఎన్‌డిఓ, బిజెడ్ఎ, ఆర్‌జెవై, వైఎల్ఎం, బివిఆర్‌టి మరియు ఎస్‌జిఐఎం రైల్వేస్టేషన్లు (11 ఎస్ఎంయులు) | 22/11/2023 15.00గం.లు |
| కేటరింగ్ | జనరల్ మైనర్ యూనిట్లు (జిఎంయులు) ఎకెవిడి, & ఎస్ఎల్ఎస్ రైల్వేస్టేషన్లు (02 జిఎంయులు) | 22/11/2023 15.00గం.లు |

1. ఈ-వేలంలో పాల్గొను వారు తప్పనిసరిగా డిజిటల్ సిగ్నేచర్ పొంది ఉండవలెను.
2. బిడ్డరు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా నందు కరెంట్ అకౌంట్ కల్గి యుండి ఐఆర్ఈపీఎస్‌లోని ఆక్షన్ లీజింగ్ మాడ్యూల్‌కు ఆ అకౌంట్‌ను అనుసంధానం చేయవలెను.
3. ఈ-వేలం కొరకు వన్‌టైమ్ ఆన్‌లైన్ సెల్ఫ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి. తద్వారా భారతీయ రైల్వేల యొక్క ఏదైనా రైల్వే డివిజన్ యందు ఏ వేలంలోనైనా పాల్గొనుటకు భౌగోళిక అడ్డంకులు ఉండవు.
4. ఈ-ఆక్షన్‌కు తేదీలు టైమ్ స్లాట్‌లు పైన ఇవ్వబడిన విధంగా ఈ-ఆక్షన్ లీజింగ్ మాడ్యూల్ ఐఆర్ఈపీఎస్ దరఖాస్తు యందు (www.ireps.gov.in) కలవు. దయచేసి గమనించి తదనుగుణంగా వేలం యందు పాల్గొనగలరు.

ఈ-వేలం సందర్భంగా ఐఆర్ఈపీఎస్ పోర్టల్ యందు ఏవైనా ఆటంకములు తలెత్తినచో రైల్వే అధికార యంత్రాంగం బాధ్యత వహించదు. ఐఆర్ఈపీఎస్ దరఖాస్తు (www.ireps.gov.in) యందు హోం పేజిలో ఎడమ నేవిగేషన్ బార్ వద్ద లభించు లెర్నింగ్ సెంటర్ లింక్ ద్వారా యూజర్ మ్యాన్యువల్‌ను చదివి బిడ్డర్లు అర్థం చేసుకొని ఈ-వేలం విధానం తెలుసుకొని పాల్గొనవలెను.

A1688 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, విజయవాడ


## బాణాసంచా అక్రమ వ్యాపారంపై ఉక్కుపాదం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఈ నెల నవంబర్-12 వ తేదీన జరగనున్న దీపావళి పండుగ సందర్భముగా నగర పోలీస్ కమిషనర్ డా. ఏ.రవి శంకర్, ఐ.పీ.ఎస్., గారి ఆదేశాల మేరకు డి.సి.పి-1 కే. శ్రీనివాసరావు, ఐ.పీ.ఎస్., గారు మరియు డి.సి.పి-2 కే. ఆనంద రెడ్డి గారు మరియు ఇతర నగర పోలీసు ఉన్నతాధికారులు బాణసంచా తయారుచేయు/విక్రయించే దుకాణాల నిర్వాహకులతో ఈ రోజు పోలీసు కాన్ఫరెన్స్ హాల్ నందు సమావేశం నిర్వహించి, ఎవరైనా అనుమతి లేకుండా బాణ సంచా/టపాసులను ఇళ్లల్లో, షాపులలో, జన సముదాయాల మధ్య గోడౌన్‌లలో స్టాకు అనుమతి లేకుండా నిల్వలు కలిగి ఉన్న లేదా లైసెన్సు లేకుండా విక్రయించిన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని వారికి తెలిపారు.

బాణాసంచా విక్రయించే దూకణదారులు ఈ క్రింది నియమనిబంధనలను తప్పని సరిగా పాటించాలి:-

1. బాణాసంచా నిల్వచేసే కేంద్రాల నిర్వాహకులు, తయారీ చేసేవారు, విక్రయాలు చేసేవారు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలన్నారు.

2. బాణసంచా సామాగ్రి తయారీ, నిల్వ కేంద్రాలు ప్రజల నివాస ప్రాంతాలకు నిర్దిష్ట దూరంలో ఉండాలన్నారు.

## మహిళా వాలంటీరుపై కీచకపర్వం



**అనంతపురం, (విశాఖ సమాచారమ్):** చనిపోయిన బంధువుకు పింఛన్ ఆపేశాననే కక్షతో వైకాపా ఎంపీటీసీ సభ్యురాలు, ఆమె కుటుంబసభ్యులు తనపై దాడి చేసి అమానుషంగా ప్రవర్తించారంటూ శ్రీసత్య సాయి జిల్లా అగళి మండలం కదిరేపల్లికి చెందిన వేద అనే మహిళా వాలంటీరు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆమె మాట్లాడిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. తనకు, తన కుటుంబానికి మడకశిర వైకాపా ఎమ్మెల్యే తిప్పేస్వామి, ఎంపీటీసీ కుటుంబసభ్యులు, స్థానిక నాయకులతో ప్రాణహాని ఉందని పేర్కొంది. పింఛను ఆపేశాననే కోపంతో ఎంపీటీసీ సభ్యురాలు నింగమ్మ భర్త బసవరాజు, మరికొంతమంది కలిసి మొదట తనతో గొడవపడ్డారని, తర్వాత తన సోదరుడిపై దాడి చేశారని.. ఈ విషయమై ప్రశ్నించడానికి వెళితే తన తమ్ముడిని, తల్లిని కొట్టి, తన దుస్తులు చింపి అసభ్యంగా ప్రవర్తించారని ఆమె ఆరోపించారు. పైగా తమ మీదనే తప్పుడు కేసు పెట్టగా.. సోమవారం తమ కుటుంబ సభ్యులు నలుగురిని పోలీసులు అరెస్టు చేశారన్నారు. దీనిపై ఎంపీటీసీ భర్త బసవరాజు మాట్లాడుతూ.. వాలంటీరు కుటుంబసభ్యులే తనపై దాడి చేశారని చెప్పారు. ఈ వివాదంపై ఎస్ఐ లావణ్యను వివరణ కోరగా, ఇటీవల ఓ వివాదానికి సంబంధించి ఇరువర్గాల ఫిర్యాదు మేరకు వాలంటీరు కుటుంబ సభ్యులు నలుగురిని అరెస్టు చేశామన్నారు. అలాగే ఎంపీటీసీ కుటుంబసభ్యులు 16 మందిపైనా కేసులు నమోదు చేశామని తెలిపారు.

## దేశ సమగ్రతకు దిక్సూచి యూత్ హాస్టల్

### బీహార్ గవర్నర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** భిన్నత్వంలో ఏకత్వ భావన కల్పించడంలో యూత్ హాస్టల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (వై.హెచ్.ఎ ఐ) ముందంజలో ఉందని ఆ సంస్థ జాతీయ అధ్యక్షులు, బీహార్ రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ అన్నారు. దేశం నలుమూలల విభిన్న సాహస క్రీడల నిర్వహిస్తూ ప్రజలందరినీ ఒక తాటిపై తీసుకురావడంలో వై హెచ్ ఎ ఐ ముఖ్య భూమిక పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు. యూత్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్లాటినం జూబ్లీ వేడుకలను మంగళవారం విశాఖపట్నం సూర్యా బాగ్ హోటల్ దశపల్ల లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్లేకర్ మాట్లాడుతూ, సమాజంలో మనం ఒక భాగం అనే విషయాన్ని యువత మర్చిపోరాదని అన్నారు. ఉత్తమ వ్యక్తిత్వం ఉన్నప్పుడే మంచి ఫలితం సాధించగలమని ఆయన చెప్పారు పాఠశాలలో చదువుకునే టప్పుడు భారతదేశం నా మాతృభూమి భారతీయులందరూ నా సహోదరులు అంటూ ప్రతిజ్ఞ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. భారతదేశము దేశ ప్రజలందరికీ తల్లి వంటిదని అందుకనే ఈ దేశంలో నివసించే వారందరూ అన్నదమ్ములుగా పేర్కొన్నారు అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ నినాదాలు ఇచ్చారని ఎక్కడైతే ఐక్యమత్యం ఉంటుందో అక్కడ స్పష్టత అభివృద్ధి ఉంటుందని పేర్కొన్నారు. నేటి యువత ఉత్తమ పౌరులుగా ఎందుకు బాల్య దశ నుంచే కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. దేశ నవ నిర్మాణంలో యూత్ హాస్టల్స్ ముఖ్య భూమిక పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు. యువత సేవ వినియోగించుకోవాలని బీహార్ గవర్నర్ అర్లేకర్ పిలుపునిచ్చారు. వై హెచ్ ఎ ఐ. నేషనల్ చైర్మన్ ఎస్. వెంకట్ నారాయణన్ యూత్ హాస్టల్ కార్యకలాపాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సభకు వివరించారు. హెచ్ఎఐ నేషనల్ వైస్ చైర్మన్ రాష్ట్ర శాఖ చైర్మన్ సిహెచ్ రవిపాల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సోమరాజు పూర్వ చైర్మన్ డి. ఉమామహేశ్వరరావు అతిథి లుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ కు రాష్ట్ర చైర్మన్ రవి పాల్

బొబ్బిలి వీణ బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ, జాతీయ ప్రతినిధులు హాజరయ్యారు. నెహ్రూ యువ కేంద్ర (ఎన్. వై .కే ) నిర్వహిస్తున్న 15వ నేషనల్ ట్రైబల్ యువ సమ్మేళనంలో పాల్గొన్న 200 మంది యువ ప్రతినిధులు కార్యక్రమానికిహాజరయ్యారు. బీహార్, జార్ఖండ్, మహారాష్ట్ర , ఒడిశా రాష్ట్రాలకు చెందిన ఆదివాసి యువతను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు.

## బాలిక పై లైంగిక దాడికి పాల్పడిన కేసు నందు నిందితుడికి 20 సంవత్సరాలు జైలు




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నగర పోలీసు కమిషనర్ డా. ఏ. రవి శంకర్, ఐ.పీ.ఎస్., గారు ప్రయారిటీ కేసుగా తీసుకొని, ప్రత్యేకముగా అధికారులతో మోనటరింగ్ చేయించి ఐదు సంవత్సరాల బాలిక పై లైంగిక దాడికి పాల్పడిన కేసు నందు నిందితుడికి 20 సంవత్సరాల కన్విక్షన్ పడేంత వరకూ పూర్తి మోనటరింగ్ చేయడం జరిగినది.

మంగళవారం విశాఖపట్నం గౌరవ స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి ఆనంది మల్కాపురం పోలీసు స్టేషన్, Cr no 227/2022 vide SC no 55/23 U/S 376(AB) IPC, Sec 5(m) r/w 6 of POCSO Act 2012 నందు విచారణ ముగిసిన తర్వాత ముద్దాయి సదరం సాయి కుమార్ (s/o గంగా సింగ్ వయస్సు 27yrs) కు 20 సంవత్సరాల జైలు శిక్ష , 5,000/- జరిమానా మరియు బాధితురాలికి 5,00,000 నష్ట పరిహారం చెల్లించాలని తీర్పు ఇవ్వడం జరిగింది.

మల్కాపురం బర్మా కాలనీలో నివాసం ఉంటున్న బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు ప్రకారం తమ చిన్న కుమార్తె ఇంటికి సమీపంలో తోటి పిల్లలతో ఆడుకోవడానికి వెళ్ళింది. కొంత సమయం తరువాత సదరు బాలిక తండ్రి కుమార్తె కోసం వెతకగా, ఆమె పెద్ద కుమార్తె సదరం సాయికుమార్ తన ఇంటికి ఆమెను తీసుకొని వెళ్లినట్లు చెప్పింది. కొంత సమయం తరువాత వచ్చిన ఆమె కుమార్తెను చూసి అనుమానం వచ్చి ఏమి జరిగిందని ప్రశ్నించగా, సదరు బాలిక సాయి కుమార్ అనే వ్యక్తి, తన ప్రైవేట్ భాగాలను తాకి, తనతో ప్రవర్తించిన తీరును వివరించగా, వెంటనే బాలిక తల్లిదండ్రులు మల్కాపురం పోలీసులుకు సమాచారం అందజేయగా,పోలీసులు విచారించి బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు గుర్తించి, సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయడం జరిగినది, విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో గౌరవ కోర్టు వారు పై సంచలన తీర్పు విధించడం జరిగినది.

పై కేసు నందు కన్విక్షన్ పడుటలో ప్రతిభ కనబరిచిన స్పెషల్ పోక్సో పీ.పీ కరణం కృష్ణ ని, కేసు ట్రయిల్ జరగడంలో పురోగతి చూపించిన కేసు ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ అయిన అప్పటి దిశా పోలీస్ స్టేషన్ ఏ.సి.పి శ్రీమతి ప్రేమ్ కాజల్ , ఛార్జ్ షీట్ దాఖలు చేసిన ప్రస్తుత దిశా పోలీస్ స్టేషన్ ఏ.సి.పి CH.వివేకానంద ని, సి.ఐ(సి.యం.ఎస్) ఈ.నరసింహారావుని, హెచ్.సి ఆర్.పైడి తల్లి ని మరియు సిబ్బందిని నగర పోలీసు కమిషనర్ డా.ఏ. రవి శంకర్, ఐ.పి.ఎస్., గారు అభినందించడం జరిగింది, కోర్టు ట్రైల్స్ నందు విశేష సేవలు అందించినందుకు గాను అభినంధించి, గౌరవ డి.జి.పి అదేశాలను అనుసరించి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొన్న ప్రయారిటీ కేసుల నందు కోర్టులో ట్రయిల్ కు వచ్చి కన్విక్షన్ పడేంత వరకూ ఉన్నతాధికారులు ప్రతీ కేసును కన్విక్షన్ పడే వరకూ పూర్తి మోనటరింగ్ చేయాలని, ప్రతీ ఉన్నతాధికారి 5 కేసులు మోనటరింగ్ చేసే విధముగా అదేశాలు ఇచ్చామనీ ,కేసుల విషయం లో క్రమం తప్పకుండా స్టేషన్ ఇన్స్పెక్టర్ల తో మాట్లాడుతూ ఉండాలని, ఎక్కువ కేసులు గల రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీటర్స్ పై నిరంతరం దృష్టి పెట్టాలని తెలిపారు, ప్రతీ నెలా కన్విక్షన్ పడుతున్న కేసుల సంఖ్య మునుపటి నెలతో పోల్చినప్పుడు పెరుగుదల కనిపించాలని తెలిపారు

## సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే కఠిన శిక్షలు తప్పవు : కేంద్ర ప్రభుత్వం

రష్మిక డీప్‌ఫేక్ వీడియోతర్వాత వేషధారణపై కఠిన చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియా కంపెనీలను ప్రభుత్వం ఆదేశించింది.

సాంకేతిక పురోగతి కేవలం ఒక చిత్రం నుండి వ్యక్తుల యొక్క నకిలీ వీడియోలను రూపొందించడం సులభం చేసింది.

భారతదేశంలోని అన్ని ప్రధాన సోషల్ మీడియా కంపెనీలకు ప్రభుత్వం మంగళవారం ఒక సలహా జారీ చేసింది, మరొక వ్యక్తి వలె నటించే ఏ కంటెంట్‌ను హోస్ట్ చేయకూడదని మరియు చట్టానికి అనుగుణంగా ఫిర్యాదులను స్వీకరించిన 24 గంటల్లోపు అటువంటి కంటెంట్‌ను వెంటనే తీసివేయమని వినియోగదారులకు తెలియజేయమని కోరింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఉత్పత్తి చేయబడిన నకిలీ కంటెంట్‌ను 24 గంటల్లో తొలగించాలని MeitY Facebook, Instagram మరియు YouTubeతో సహా సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లకు సలహాలను పంపింది

సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో నటి రష్మిక మందన్న నటించిన డీప్‌ఫేక్ వీడియో వైరల్ కావడంతో ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది.

వీడియో వైరల్ కావడంతో, బాలీవుడ్ వెటరన్ అమితాబ్ బచ్చన్‌తో సహా చాలా మంది వ్యక్తులు నేరపూరిత చర్యకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటర్నెట్‌ను ఉపయోగించే డిజిటల్ పౌరులందరికీ భద్రత మరియు నమ్మకాన్ని నిర్ధారించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ సోమవారం హామీ ఇచ్చారు.

ఏ వినియోగదారు అయినా తప్పుడు సమాచారాన్ని పోస్ట్ చేయడాన్ని నిరోధించడం ప్లాట్‌ఫారమ్‌లకు చట్టపరమైన బాధ్యత అని మరియు ఏదైనా వినియోగదారు లేదా ప్రభుత్వం నివేదించినప్పుడు, తప్పుడు సమాచారం 36 గంటల్లో తొలగించబడుతుందని ఆయన నొక్కి చెప్పారు.

"ప్లాట్‌ఫారమ్‌లు దీనికి కట్టుబడి ఉండకపోతే, రూల్ 7 వర్తింపజేయబడుతుంది మరియు IPC నిబంధనల ప్రకారం ప్లాట్‌ఫారమ్‌లను బాధిత వ్యక్తులు కోర్టుకు తీసుకెళ్లవచ్చు" అని చంద్రశేఖర్ అన్నారు.

IT చట్టం 2000 (రూల్ 3(1) (b)(vii) ప్రకారం, సోషల్ మీడియా మధ్యవర్తులు తగిన శ్రద్ధను పాటించవలసి ఉంటుంది, ఇందులో మధ్యవర్తి యొక్క నియమాలు మరియు నిబంధనలు, గోప్యతా విధానం లేదా వినియోగదారు ఒప్పందం తెలియజేసేలా చూసుకోవాలి. వినియోగదారులు మరొక వ్యక్తి వలె నటించే కంటెంట్‌ను హోస్ట్ చేయకూడదు.

నియమం నిర్దేశిస్తుంది, 'వ్యక్తుల కృత్రిమంగా మార్ఫింగ్ చేయబడిన చిత్రాలతో సహా ఎలక్ట్రానిక్ రూపంలో వంచన స్వభావం గల ఏదైనా కంటెంట్‌కు సంబంధించి ఫిర్యాదు అందినప్పటి



నుండి 24 గంటలలోపు మధ్యవర్తులు అటువంటి కంటెంట్‌కు ప్రాప్యతను తీసివేయడానికి లేదా నిలిపివేయడానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకోవాలి. 'ఇంకా, ఇది 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష మరియు రూ. 1 లక్ష వరకు జరిమానాతో సహా శిక్షలను అందిస్తుంది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం, 2000లోని సెక్షన్ 66డి ప్రకారం, కంప్యూటర్ వనరులను ఉపయోగించి పర్సనైజేషన్ ద్వారా మోసం చేస్తే 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష మరియు రూ. 1 లక్ష వరకు జరిమానా.

మందన్న తన డీప్‌ఫేక్ వీడియోకు వ్యతిరేకంగా తీవ్రంగా స్పందించిన తర్వాత, 'టైగర్ 3' నుండి నటి కత్రినా కైఫ్ యొక్క కొత్త మార్ఫింగ్ చిత్రం ఇప్పుడు సోషల్ మీడియాలో రౌండ్లు చేస్తోంది.

# కాఫీని దళారులకు విక్రయించి మోసపోవద్దు



పాడేరు, (విశాఖ సమాచారమ్): గిరిజన కాఫీ రైతులు కాఫీ ఫలసాయాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. కాఫీ కొనుగోళ్లు, విక్రయాలపై మంగళవారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేసారు. కాఫీకి డిసెంబరు, జనవరి నెలలో మంచి ధర పలుకుతుందని అంతవరకు రైతులు వేచి ఉండాలని సూచించారు. కిలో రూ.150 లు, రూ.155 లకు విక్రయించడం వలన రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. రూ.300 ధర వచ్చినపుడు విక్రయించాలని చెప్పారు. ఐటిడి ఏ ఈ ఏడాది కాఫీ పండ్లకు రూ.43 రూపాయలను ప్రకటించిందన్నారు. కాఫీ పళ్లను సరఫరా చేసిన వారం రోజుల్లో రైతులకు డబ్బులు చెల్లిస్తారని చెప్పారు.పల్పింగ్ చేసి విక్రయించగా వచ్చిన లాభాన్ని తిరిగి రైతులకు బోనస్ గా పంపిణీ చేస్తామన్నారు. గత ఏడాది కాఫీ పళ్లను రూ.36 లకు కొనుగోలు చేసి అనంతరం ఎనిమిది రూపాయలను బోనస్ గా రైతులకు చెల్లించారని చెప్పారు. షావుకారులకు కాఫీ ఫల సాయాన్ని విక్రయిస్తే తూకంలో మోసం చేస్తారని స్పష్టం చేసారు. అదేవిధంగా షావుకారులు నాణ్యమైన కాఫీ పళ్లను కొనుగోలు చేసి కొంత మేరకు తరుగుని తీసేస్తారని చెప్పారు. మాక్స్ సంస్థ అన్నిరకాల కాఫీ పండ్లను కొనుగోలు చేస్తుందని చెప్పారు. రైతులు అప్రమత్తంగా ఉండి మంచి ధర వచ్చే వరకు వేచి ఉండి కాఫీని విక్రయించాలని సూచించారు.

# 2,65,778 మందికి రూ.109.77 కోట్లు రైతు భరోసా జమ



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): జిల్లాలో 2 లక్షల 65 వేల 778 మంది రైతు లబ్ధిదారులకు రూ. 109.77 కోట్లు రైతు భరోసా జమ అయినట్లు జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం లో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ఆయన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తో కలిసి రైతులకు "రైతు భరోసా పిఎం కిసాన్" చెక్కును అందజేశారు. పుట్టపర్తిలో జరిగిన కార్యక్రమంలో వైఎస్ఆర్ రైతు భరోసా-పిఎం కిసాన్ పథకం క్రింద రాష్ట్రంలోని రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి నగదు విడుదల చేశారు. బటన్ నొక్కి ఒక్కో రైతు ఖాతాలో రూ.4వేలు చొప్పున జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారాన్ని ప్రదర్శించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న రైతు భరోసాను సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మ శ్రీ మాట్లాడుతూ తమ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వం అని ఇప్పటివరకు రైతన్నలకు ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన దానికన్నా. మిన్నగా ప్రతీ సాగుచేసే రైతు కుటుంబానికి రూ. 1000/- అదనంగా అనగా రూ.13,500/- చొప్పున నేరుగా రైతుల ఖాతాలకు జమచేయడం జరిగిందిని చెప్పారు. ఇప్పటి వరకు రూ.1572 కోట్లు రైతుల ఖాతాలకు జమచేసినందుకు ముఖ్యమంత్రి కి రైతులందరూ రుణపడి ఉంటారన్నారు. జిల్లా రైతు సలహా సంఘం అధ్యక్షులు చిక్కాల రామారావు మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. వ్యవసాయ సలహా మండలి సమావేశాలను ప్రతీనెలా ఆర్‌బికె, మండల, జిల్లా స్థాయిల్లో నిర్వహిస్తూ సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతోందని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామంలోనే విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో , జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రావు, బుచ్చయ్యపేట జెడ్.పి.టి.సి. దొండా రాంబాబు, డి.సి.ఎం.ఎస్. చైర్మన్ పల్లా నర్సింగరావు, వైస్ ఎం.పి.పి కశింకోట పెంటకోట జ్యోతి, తుమ్మపాల సర్పంచ్ ఎం.పి.టి.సి., డి.సి.సి.బి. ఎల్.డి.ఎమ్. వ్యవసాయ మరియు అనుబంధ శాఖల అధికారులు, డి.ఎ.ఎ.బి మెంటర్లు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వన్ టౌన్ సీఐ ని హృదయపూర్వకంగా కలిసిన అల్ మదద్ హెల్పింగ్ హ్యాండ్ వెల్ఫేర్ సొసైటీ



కలెక్టరేట్, (విశాఖ సమాచారమ్): వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు నూతనంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ గా ఛార్జ్ తీసుకున్నా, బి. భాస్కర్ రావు ని అల్ మదద్ హెల్పింగ్ హ్యాండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు యమ్ డి. అలీం మరియు ఉపాధ్యక్షుడు డి. హరీష్(మున్నా ), ప్రెస్ రిపోటర్ కే. రవి కుమార్ మరియు యస్ క్.అహ్మద్, అతన్ని కలిసి హృదయపూర్వకంగా అతనికి శాలువ తొ స్వాగతం చెప్పారు.

# సామాజిక సాధికార యాత్ర'కు ముమ్మర ఏర్పాట్లు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): ఈనెల తొమ్మిదవ తేదీన అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో ఈ సామాజిక సాధికార బస్సు యాత్ర సభ జరగబోతోంది. ఇప్పటివరకు జరిగిన సభలన్నిటికన్నా అనకాపల్లి సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ చర్యలు తీసుకుంటున్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం సాయంత్రం మూడు గంటలకు ప్రారంభం కానున్న ఈ సభా కార్యక్రమానికి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, పార్టీ అభిమానులు తరలిరానున్నారు.

ఈ సభకు వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి తో సహా పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కాబోతున్నారు. ఈ సభకు పరిశీలకులుగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఇప్పటికే అనకాపల్లికి చేరుకున్నారు. ఆయన మంత్రి అమర్నాథ్ తో కలిసి స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశమై అనకాపల్లి అర్బన్, రూరల్ ప్రాంతాలకు చెందిన పార్టీ శ్రేణులకు సభ నిర్వహణకు సంబంధించి దిశా నిర్దేశం చేశారు.

అంతేకాకుండా ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న సభ ఏర్పాట్లను వీరు మంగళవారం పరిశీలించారు. సభకు పెద్ద ఎత్తున జనం తరలివస్తున్న నేపథ్యంలో వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందిని మంత్రి అమర్నాథ్ కోరారు. అలాగే సభకు హాజరవుతున్న ముఖ్య నేతలకు బైక్ ర్యాలీతో స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈ సందర్భంగా మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ 9వ తేదీన అనకాపల్లిలో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్ర సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విజయవంతంగా అమలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల వారికి, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్న సహాయ సహకారాలను ప్రజలకు తెలియచెప్పడంతోపాటు, వచ్చే ఎన్నికలకు పార్టీ శ్రేణులను సంసిద్ధులను చేసేందుకు ఈ బస్సు యాత్ర ఎంతగానో ఉపకరిస్తుందని అమర్నాథ్ అన్నారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, మందపాటి జానకిరామరాజు, జాజుల రమేష్, అల్ల నాగేశ్వరరావు, వేగి త్రినాధ తదితరులు పాల్గొన్నారు.



# బాణాసంచా కాలుష్యంపై ఉన్నత న్యాయస్థానంలో ఫిర్యాదులు



ఢిల్లీ: దేశంలో బాణాసంచా అమ్మకాలు, కొనుగోళ్లు, వినియోగంపై బ్యాన్ కోరుతూ సుప్రీంలో పిటిషన్లు నమోదయ్యాయి. రాజస్థాన్ పిటిషన్లపై సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. సుప్రీంకోర్టు గత తీర్పు కేవలం ఢిల్లీకే పరిమితం అనుకుం టున్నారని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ తీర్పు దేశమంతటా వర్తిస్తుందని అందరికీ తెలియాలన్నారు. గతంలో ఇచ్చిన తీర్పును దేశమంతటా అమలు చేయాలన్నారు. ఆస్పత్రులు, పాఠశాల లు వంటి ప్రాంతాల్లోనైనా బాణసంచా వినియోగం లేకుండా నిషేధం విధించాలని పిటిషనర్ పేర్కొన్నారు. కాలుష్యం స్థాయుల్లో స్వల్ప పెరుగుదల మాత్రమే ఉందని.. ప్రతి వ్యక్తి టపాసులు వినియోగాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని రాజస్థాన్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తెలిపింది.

ఈ రోజుల్లో పిల్లలు కాల్చడం లేదని.. పెద్దలే బాణాసంచా ఎక్కువగా కాల్చుతున్నారని ధర్మాసనం అభిప్రాయపడింది. పర్యావరణానికి హాని కల్గించే అంశాలపై కేవలం కోర్టులకు మాత్రమే బాధ్యత ఉందన్న తప్పుడు భావన ప్రజల్లో ఉందని తెలిపింది. దీనిపై ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించింది. వాయు కాలుష్యంపై తామిచ్చిన ఆదేశాలను రాజస్థాన్ ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేయాలని ధర్మాసనం సూచించింది. పండుగ వేళల్లో ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. ఇంతకు మించి ప్రత్యేక ఆదేశాలు అవసరం లేదని.. ప్రజలకు అవగాహన కల్గించడమే ఇక్కడ ముఖ్యమని ధర్మాసనం తెలిపింది.

# ఫ్రైడ్ రైస్ తిని వ్యక్తి మృతి

## 'ఫ్రైడ్ రైస్ సిండ్రోమ్' కారణం అంటోన్న వైద్యులు



న్యూఢిల్లీ: సాధారణంగా ఓసారి వండిన ఆహారాన్ని మళ్లీ వేడి చేయకూడదు. ఇలా చేయడం వల్ల ఆహారం కలుషితం అయ్యి ఆరోగ్యానికి హాని కలిగించే అవకాశం ఉంది. ఇటువంటి ఆహారాన్ని తింటే లేనిపోని రోగాలను కొని తెచ్చుకున్నట్లే అవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకసారి వండిన ఆహారాన్ని ఫ్రైడ్ రైస్ తయారు చేసి, దానిని మళ్లీ వేడి చేసి తినడం వల్ల ఓ వ్యక్తి మరణించాడు. ఇందుకు సంబంధించిన వార్త ఇంటర్నెట్‌లో వైరల్ అవుతోంది. సదరు వ్యక్తి మరణానికి 'ఫ్రైడ్ రైస్ సింద్రోమ్' కారణమని తేలడంతో ఈ విషయం కాస్తా హాట్ టాపిక్‌గా మారింది. అసలు ఫ్రైడ్ రైస్ సింద్రోమ్ అంటే ఏంటి? ఎవరికి వస్తుంది? ఎలా వస్తుంది? దాని లక్షణాలు ఎలా ఉంటాయి వంటి వివరాలు తెలుసుకుందాం..

ఫ్రైడ్ రైస్ సింద్రోమ్ అనేది మొదటిసారిగా 2008లో వెలుగులోకి వచ్చింది. 20 ఏళ్ల ఓ కాలేజీ యువకుడు నూడుల్స్ ప్రిపేర్ చేసి తిన్నాడు. మిగిలిన దాన్ని ఫ్రిజ్‌లో పెట్టి 5 రోజుల తర్వాత మళ్లీ వేడి చేసి తిన్నాడు. దీంతో అది పాయిజన్ అయ్యి చివరికి అతని ప్రాణాలను తీసింది.

**ఫ్రైడ్ రైస్ సింద్రోమ్ అంటే..?**

అమెరికన్ జర్నల్ ఆఫ్ బయోమెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ ప్రకారం.. 'ఫ్రైడ్ రైస్ సింద్రోమ్' అనేది ఆహారం ద్వారా సంక్రమించే వ్యాధి. బాసిల్లస్ సెరియస్ అనే బాక్టీరియం ద్వారా ద్వారా ఫుడ్ పాయిజన్ అవుతుంది. ఈ బ్యాక్టీరియా విషాన్ని ఉత్పత్తి చేస్తుంది. ఇలా కలుషితమైన పదార్థాన్ని తింటే వాంతులు, డయేరియా వంటి జీర్ణాశయ వ్యాధులకు కారణమవుతుంది. అయితే చాలా అరుదుగా మాత్రమే మరణం సంభవిస్తుంది.

ఈ బ్యాక్టీరియా ప్రతి ఆహారంలో ఉత్పత్తి అవుతుంది. ఇది వండిన ఆహారం, సరైన పద్ధతిలో నిల్వ చేయని కొన్ని ఆహారాల్లో ఎక్కువగా ఉంటుంది. బియ్యం, పాస్తా వంటి పిండి పదార్థాలు ఎక్కువ సమయం నిల్వ ఉంచితే చెడిపోయే అవకాశం ఉంది. వండిన కూరగాయలు, మాంసం వంటకాలు వంటి ఇతర ఆహారాలను కూడా ఇది ప్రభావితం చేస్తుంది. ఇందులోని బ్యాక్టీరియా రెండు రకాల ట్యాక్సిన్లను ఉత్పత్తి చేస్తుంది. హీట్ యాసిడ్ లేబుల్ ఎంట్రోటాక్సిన్, హీట్-నిరోధక ఎమెటిక్ టాక్సిన్‌లను విడుదల చేస్తుంది. ఫుడ్‌ను వేడి చేయడం వల్ల అవి విషతుల్య రసాయనాలను విడుదల చేస్తాయి.

**ఫ్రైడ్ రైస్ సింద్రోమ్ లక్షణాలు..**

బాసిల్లస్ సెరియస్ బ్యాక్టీరియా ఉన్న వాంతులు, వికారం, కడుపు నొప్పి, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. పరిస్థితి 12 గంటల కంటే తక్కువగా ఉండవచ్చు. సాధారణంగా ఈ లక్షణాలు 24 గంటల తర్వాత తగ్గుముఖం పడతాయి.

# అదుపు తప్పిన బస్సు.అమ్మమ్మ, మనవడు సహా మరో యువకుడి విషాదాంతం



విజయవాడ: చనిపోయిన చిన్నారి చెర్రి వారు విజయవాడ నుంచి చీరాల రైలులో వెళ్దామనుకున్నారు.. ఎక్కాల్సిన బండి వెళ్లిపోవడంతో విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌కు చేరుకున్నారు. అంతలోనే బస్సు రూపంలో అమ్మమ్మను.. మనవడిని మృత్యువు కబళించింది. మరొకరు వేరే వారి విధులకు వచ్చి తనువు చాలించారు. విజయ వాడ పండిత్ నెహ్రూ బస్టాండ్‌లో జరిగిన ప్రమాద ఘటనలో ముగ్గురు దుర్మరణం చెందగా.. పలువురికి గాయాలయ్యాయి. వారి మృతదేహాలను విజయవాడ కొత్త ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి బంధువులకు పోలీసులు అప్పగించారు.

బాపట్ల జిల్లా చీరాలలోని ఉజిలిపేటలో నివాసం ఉండే మోటాని కుమారి (45) కుమార్తె కాకి ఝాన్సీ గుంటూరు జిల్లా తాడేపల్లి సమీపంలోని వడ్డేశ్వరంలో నివాసం ఉంటోంది. ఝాన్సీకి వివాహమైన 18 ఏళ్ల తర్వాత ఇద్దరు కుమారులు కలిగారు. పెద్ద కుమారుడికి ఏడాదిన్నర వయసు కాగా చిన్న బాబుకి సుమారు ఏడు నెలలు. ఈ క్రమంలో మనవడికి నామకరణం, అన్నప్రాసన చేయించాలని అమ్మమ్మ తలచారు. వారిని తీసుకెళ్లేందుకు కుమార్తె ఇంటికి వచ్చారు. సోమవారం ఉదయం కుమారి, ఝాన్సీలు కుటుంబ సభ్యులతో కలిసి పినాకిని ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కేందుకు విజయవాడ వచ్చారు. అది వెళ్లిపోవడంతో పండిట్ నెహ్రూ బస్టాండ్‌కు చేరుకున్నారు. చీరాల బస్సు ఎక్కేందుకు వేచి ఉండగా బస్సు దూసుకొచ్చి అమ్మమ్మ కుమారి, మనవడు చెర్రీ (ఏడు నెలలు) మృతి చెందారు. ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందడంతో వారి బంధువులు రోదనలు మిన్నంటాయి. చెర్రీ తండ్రి విధుల నిమిత్తం తిరుపతికి వెళ్లారని.. ఝాన్సీని, చెర్రీని అమ్మమ్మ ఇంటికి వెళ్లమన్నారని బంధువులు తెలిపారు. చెర్రీకి చిన్న జ్వరం వచ్చినా అమ్మమ్మ కుమారి తట్టుకోలేకపోయేదంటూ విలపించారు. కాగా కుమారి కుటుంబ సభ్యులు దాదాపు 25 ఏళ్ల కిందట చీరాల్లోని ఉజిలిపేటకు వచ్చారు. భర్త రాజు కరెంటు పని చేసేవారు. అప్పటి నుంచి చుట్టుపక్కల వారితో కలిసి మెలిసి ఉంటారు. ఏడాది కిందట భర్త అనారోగ్యంతో మృతి చెందారు. ఇక అన్నీతానై ఆ కుటుంబాన్ని ఆమే చూసుకుంటోంది. అద్దె ఇంట్లో ఉంటోంది. ఆ పక్కనే ఉన్న సొంత ఇంటిని అద్దెకు ఇచ్చారు. ప్రమాద విషయం తెలియడంతో ఆమె ఇంటి వద్ద విషాదం నెలకొంది. చుట్టుపక్కల వారు మృతురాలి ఇంటి వద్దకు చేరుకున్నారు. నిన్న ఈ సమయంలో ఇక్కడే ఉంది.. మనవడికి శు భ కార్యక్రమం చేయాలని అనుకుని వారిని తీసుకురావడానికి వెళ్లింది. అయ్యో.. ఇంత లోనే ఎంత ఘోరం జరిగిందంటూ వారు విచారం వ్యక్తం చేస్తున్నారు.

**గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తూ..**

**ఎదిగొచ్చిన కుమారుడు దూరం**

గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన యడ్లపల్లి వీరయ్య (21) ఏడాదిన్నర నుంచి ఆర్టీసీలో ఔట్ సోర్సింగ్ బుకింగ్ క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వీరయ్య తల్లిదండ్రులు నాగేశ్వరరావు, నాగమ్మ వ్యవసాయ కూలీలు. వారికి ఇద్దరు ఆడపిల్లలు, కుమారుడు సంతానం. వీరయ్య ఆర్టీసీలో ఔట్ సోర్సింగ్



వీరయ్య (పాతచిత్రం)

బుకింగ్ క్లర్క్‌గా విధులు నిర్వహిస్తూ వచ్చే కొద్దిపాటి ఆదాయంతో తల్లిదండ్రుల్ని పోషిస్తున్నారు. అతను ప్రధానంగా విజయవాడ రూట్‌లో విధులు నిర్వహిస్తుంటారని తోటి ఉద్యోగులు తెలిపారు. ప్రతిరోజు రావిపాడు నుంచి విజయవాడకు వచ్చి విధుల నిర్వహణ అనంతరం ఇంటికి వెళ్లేవారు. సోమవారం విజయవాడలోని ఆర్టీసీ బస్టాండులో బస్సు ఢీకొని మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. తమకు ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తనకు వచ్చే ఆదాయంతో కుటుంబ సభ్యుల్ని ఏ కష్టం లేకుండా చూసుకోవాలని వీరయ్య తరచూ తమతో అంటుండేవారని పలువురు ఆర్టీసీ ఉద్యోగులు తెలిపారు. సోమవారం ఉదయం 5 గంటలకు గుంటూరులో విజయవాడ నాన్ స్టాప్ బస్‌కి విజయవాడకి వచ్చారు. ప్లాట్ ఫాంపై వేచి ఉన్న కండక్టర్ వీరయ్యను బస్సు ఢీకొట్టిందని వారి స్నేహితులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కండక్టర్ సురేష్(32) టికెట్లు కొట్టి ప్లాట్‌ఫాంపై వేచి ఉన్నారు. ఒక్కసారిగా బస్సు దూసుకొచ్చి కాలుపైకి టైర్ ఎక్కడంతో గాయాలయ్యాయి. బాధితుడిని ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. ఆయనది అమరావతి కాగా, ప్రస్తుతం గుంటూరులో ఉంటూ విధులు నిర్వహిస్తున్నారు.

ప్రమాద ఘటన చూసిన నగరానికి చెందిన లక్ష్మి అనే మహిళ షాక్‌కు గురైంది. ఆమె ఘటనా స్థలంలో స్పృహ తప్పి పడిపోయారు. పోలీసులు ఆమెను విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించడంతో కోలుకున్నారు. తరువాత ఆమెను డిశ్చార్జి అయ్యారు. బస్సు ప్రమాద ఘటనపై స్పందించేందుకు ఆమె నిరాకరించారు.

**అది నేను చేయాల్సిన డ్యూటీ**

ఆ డ్యూటీకి నేను వెళ్లాలి. నాకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో వీరయ్య వచ్చాడు. నా కోసం వెళ్లి చనిపోవడం కలచివేస్తోంది.

**అమర్నాథ్ గుంటూరు-2 డిపో కండక్టర్** (ఔట్‌సోర్సింగ్) కళ్ల ముందే ప్రాణాలు కోల్పోయారు.

ఆసుపత్రిలో చెకప్ కోసం కొత్తగూడెం నుంచి విజయవాడకు వచ్చా. ప్రమాద సమయంలో ఇక్కడే ఉన్నా. బస్సు అదుపు తప్పి ప్లాట్‌ఫారం పైకి దూసుకుపోయింది. ఆ సమయంలో నేను తోటి ప్రయాణికులను హెచ్చరించి పక్కకు పరుగెత్తా. అంతలో అక్కడే చిన్న బాబు కుర్చీలో ఉండడంతో తక్షణమే స్పందించి వెనక్కి లాగా. అనంతరం నా కళ్ల ముందే ముగ్గురిపై బస్సు చక్రం ఎక్కింది.

**అమర్‌నాథ్, సింగరేణి ఒప్పంద కార్మికుడు**

క్షణాల్లో అంతా జరిగిపోయింది.

బస్‌స్టేషన్‌లో మా మామయ్య దుకాణం ఉందని సరదాగా వచ్చా. ప్రమాద సమయంలో నేను నడిచి వెళ్తున్నా. అంతలో 11, 12వ నెంబరు ప్లాట్‌ఫాం వద్ద బస్సును డ్రైవర్ వెనక్కు తీసే క్రమంలో ఒక్కసారిగా ప్లాట్‌ఫారంపైకి వచ్చేసింది. కండక్టర్ వీరయ్య, కుమారి, చిన్నారి ఆయాన్‌లు నా కళ్ల ముందే బస్సు చక్రాల కింద పడిపోయి నుజ్జునుజ్జు అయ్యారు.

# విజయవంతంగా చంద్రబాబు కంటి శస్త్రచికిత్స



హైదరాబాద్: తెలుగుదేశం పార్టీ అధినేత, ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడికి హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లో కంటి ఆపరేషన్ నిర్వహించారు. సుమారు 45 నిమిషాల పాటు ఈ ఆపరేషన్ కొనసాగింది. ఆయన కుడి కంటికి క్యాటరాక్ట్ ఆపరేషన్‌ను చేయించుకున్నారాయన. ఈ ఆపరేషన్ విజయవంతమైంది.

కోట్లాది రూపాయల స్కిల్ డెవలప్మెంట్ కుంభకోణం కేసులో చంద్రబాబు విచారణను ఎదుర్కొంటోన్న విషయం తెలిసిందే. ఈ కేసులో 53 రోజుల పాటు ఆయన రాజమండ్రి కేంద్ర కారాగారంలో ఉన్నారు. విచారణను ఎదుర్కొన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పు, పుంగనూరులో అల్లర్ల కేసుల్లో కూడా ఆయన నోటీసులను అందుకున్నారు.

స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబు ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారు. కంటికి క్యాటరాక్ట్ ఆపరేషన్ చేయించుకోవడానికి ఏపీ హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. నాలుగు వారాల పాటు ఈ బెయిల్ మనుగడలో ఉంటుంది. ఈ నెల 28వ తేదీన సాయంత్రం 5 గంటల్లోగా చంద్రబాబు మళ్లీ రాజమండ్రి సెంట్రల్ జైలులో సరెండర్ కావాల్సి ఉంటుంది.

ఈ లోగా చంద్రబాబు తన కుడి కంటికి క్యాటరాక్ట్ ఆపరేషన్ చేయించుకున్నారు. అది విజయవంతమైందని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ వెల్లడించారు. ఇద్దరు కంటి నిపుణులైన డాక్టర్లు, ఆరు మంది నర్సుల పర్యవేక్షణలో చంద్రబాబుకు క్యాటరాక్ట్ ఆపరేషన్ జరిగింది. సుమారు 45 నిమిషాల పాటు కొనసాగింది.

ప్రస్తుతం ఆయన ఆరోగ్యంతో ఉన్నారు. ఆపరేషన్ ముగిసిన తరువాత గంట పాటు ఆయన డాక్టర్ల పర్యవేక్షణలో ఉన్నారు. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ రాకపోవడంతో ఆయనను డిశ్చార్జ్ చేశారు. చంద్రబాబుకు ఆపరేషన్ జరుగుతున్న విషయం తెలుసుకుని పలువురు టీడీపీ అభిమానులు ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి చేరుకున్నారు.

## గాయపడిన వారికి ఆర్థిక సహాయం అందజేసిన వైసీపీ పార్టీ



మాడుగుల, (విశాఖ సమాచారమ్): ఘాట్ రోడ్డులో ఈ 2న జరిగిన సామాజిక సాధికార యాత్ర భారీ బహిరంగ సభ అనంతరం ఇంటికి వెళ్తున్న వాహన డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా అవురువాడ గ్రామ శివారు పెద గొరుగడ్డకు చెందిన కొప్పాల దేముడమ్మ,కిలంబోయిన రాజులమ్మ, బిడిజన లక్ష్మి పాక్షికంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న వెంటనే మంత్రి ముత్యాలనాయుడు స్పందించి హుటాహుటిన వైజాగ్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. ఘటన సంబంధించిన వివరాలు ముఖ్యమంత్రి జగన్ కి డిప్యూటీ సీఎం తెలుపగా ఒక్కొక్కరికి 5 లక్షల చొప్పున ప్రమాద పరిహారాన్ని మంజూరు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా వైసీపీ పార్టీ స్పందించి పార్టీ తరపున ఒక్కొకరికీ లక్ష రూపాయల నగదును మాడుగులలో మంత్రి చేతుల మీదుగా సదరు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. వైసీపీ పార్టీ, ప్రభుత్వం కష్టాల్లో ఉన్న వారిని అదుకోవడంలో ముందుంటుందని ముత్యాలనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు రాజారాం, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, దేవరాపల్లి జడ్పీటీసీ కర్రి సత్యం, ఎంపీపీ రామధర్మజ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ట్రైన్ ప్రమాదంలో మృతి చెందిన హెూంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన జిల్లా ఎస్పీ.మురళీ కృష్ణ



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో హెూంగార్డు గా విధులు నిర్వహిస్తూ ట్రైన్ ప్రమాదంలో మృతి చెందిన ఎస్.గౌరీ శంకర్ హెచ్.జి. నెం.96, తల్లి అప్పలకొండ కు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హెూంగార్డులు ఒక రోజు వేతనం.3,87,660 రూపాయల చెక్ ను తన కార్యాలయంలో జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పనిచేస్తున్న హెూంగార్డు ఎవరైనా విధి నిర్వహణలో మరణించిన లేదా పదవీ విరమణ పొందిన వారికి ఆర్థికంగా ఆదుకునేందుకు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా లలో పనిచేస్తున్న హెూంగార్డులు అందరూ స్వచ్ఛందంగా వారికి వచ్చే ఒక రోజు డ్యూటీ అలవెన్స్ ను ఆర్థిక సహాయంగా అందచేస్తారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయ భాస్కర్, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనధికారి బి.శారద, సీనియర్ అసిస్టెంట్ డి.భవాని పాల్గొన్నారు.

## జగన్మోహన్ రెడ్డి ప్రతి క్షణం ప్రజా శ్రేయస్సు కోరుకునే వ్యక్తి : కె.కె రాజు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): గడపగడపకు మన ప్రభుత్వము కార్యక్రమంలో భాగంగా విశాఖ ఉత్తర నియోజకవర్గం 25వార్డు రెల్లివీధి-1 సచివాలయం 1086132 మధురానగర్,శాంతిపురం ప్రాంతంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త,రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు 25వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్‌తో కలిసి పర్యటించారు.ఈ కార్యక్రమంలో బాగంగా ఇంటింటికి వెళ్ళి ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ ఫలాలను వివరిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పర్యటించారు.

ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కొండవాలు,మురికివాడ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు.

ముఖ్యమంత్రిగా వై.యస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు సచివాలయాలు ద్వారా కొండవాలు ప్రాంతాలు, మురికివాడల్లో ఆయా లబ్ధిదారులకు విశిష్టమైన సేవలు అందుతున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో 14వార్డు కార్పొరేటర్ కె.అనిల్ కుమార్ రాజు,డైరెక్టర్ నూకరాజు,రాయుడు శ్రీను,25వార్డు సీనియర్ నాయకులు బోగవల్లి గోవింద్,సారిపిల్లి సంతోష్, హరిక్రిష్ణ, అశోక్, అప్పన్న, గౌరీనాయుడు, కొండలరావు, సన్నీ, విరమ్మ, రత్నం, జయ, శ్రీను, సత్యనారాయణ, సీనియర్ నాయకులు యం. సునీల్, కె.చిన్న, గాలి ప్రసాద్, బాబ్ జాన్,జీవీఎంసీ అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అధైర్యపడొద్దు.... అండగా ఉంటాం





విజయనగరం: వర్షాభావ పరిస్థితులను చూసి రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి భరోసా ఇచ్చారు. పంట పోయిన చోట ఇన్‌పుట్ సబ్సిడీ లేదా బీమా పరిహారాన్ని ఇప్పించడానికి కృషి చేస్తామని అన్నారు. గజపతినగరం మార్కెట్‌యార్డులో మంగళవారం జరిగిన రైతు భరోసా-పిఎం కిసాన్ విడుదల కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లాలోని సుమారు 2,63,394 మంది రైతులకు, రూ.108.42 కోట్ల రైతు భరోసా చెక్కును అందజేశారు. పుట్టపర్తిలో జరిగిన కార్యక్రమంలో వైఎస్ఆర్ రైతు భరోసా-పిఎం కిసాన్ పథకం క్రింద రాష్ట్రంలోని రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి నగదు విడుదల చేశారు. బటన్ నొక్కి ఒక్కో రైతు ఖాతాలో రూ.4వేలు చొప్పున జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, కొన్ని మండలాల్లో వర్షాభావ పరిస్థితులపై ప్రతీరోజూ సమీక్ష నిర్వహిస్తున్నామని, ఎండిపోయిన పంటల వివరాలను రోజువారీగా తెలుసుకుంటున్నామని చెప్పారు. ప్రత్యేకంగా జిల్లా స్థాయిలో కాల్‌సెంటర్‌ను కూడా ఏర్పాటు చేశామని, రైతులు ఈ కాల్‌సెంటర్‌కు ఫోన్ చేసి, తమ పంటల వివరాలను తెలియజేయవచ్చునని సూచించారు. వరి పంటకు గ్రామం యూనిట్‌గా దిగుబడి లెక్కించడం జరుగుతుందని తెలిపారు. రైతుల సమస్యలను గుర్తించేందుకు వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని ఆదేశించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. వ్యవసాయ సలహా మండలి సమావేశాలను ప్రతీనెలా ఆర్‌బికె, మండల, జిల్లా స్థాయిల్లో నిర్వహిస్తూ సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతోందని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామంలోనే విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తున్నామని చెప్పారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పటిష్టంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రతీ వాహనానికి జిపిఎస్ ఏర్పాటు చేస్తున్నామని, ధాన్యం కొనుగోలు జరిగిన పది రోజుల్లోపలే రైతుకు డబ్బు చెల్లిస్తామని కలెక్టర్ చెప్పారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గజపతినగరం శాసన సభ్యులు బొత్స అప్పలనరసయ్య మాట్లాడుతూ, రైతుకు అన్నివిధాలా వెన్నుదన్నుగా నిలిచిన ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో రైతుల కష్టాలను తెలుసుకొని, అధికారంలోకి వచ్చిన వెంటనే వారి సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. క్రమం తప్పకుండా గత ఐదేళ్లుగా రైతులకు రైతు భరోసా పథకం క్రింద సాయం అందించిన ఘనత జగన్ మోహనరెడ్డికే దక్కిందని కొనియాడారు. గత నాలుగేళ్లతో పోలిస్తే, ఈ ఏడాది వర్షపాతం కొంత తగ్గిందని, అయినప్పటికీ రైతులు అధైర్య పడవద్దని, ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రాజెక్టుల్లో ఉన్న నీటినంతా వ్యవసాయానికి మళ్లిస్తున్నామని చెప్పారు. వ్యవసాయానికి సాంకేతికతను జోడిస్తూ, డ్రోన్‌ల ద్వారా ఎరువులు, పురుగుమందులు జల్లేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని ఎంఎల్‌ఏ తెలిపారు.

డిసిఎంఎస్ ఛైరపర్సన్ డాక్టర్ అవనాపు భావన మాట్లాడుతూ, రైతు భరోసా పథకం క్రింద ప్రతీ ఏటా వ్యవసాయ అవసరాలకు ప్రభుత్వం రైతులకు డబ్బులు చెల్లించి, మదుపులకు సహాయం చేస్తోందని అన్నారు. రైతుకు ఏ కష్టం వచ్చినా, ముఖ్యమంత్రి అండగా నిలుస్తున్నారని, వారి సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు.

గజపతినగరం జెడ్‌పిటిసి సభ్యులు గార తవుడు మాట్లాడుతూ, చాలా చోట్ల వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని, తమ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ వేమల ముత్యాలరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి వి.టి.రామారావు మాట్లాడారు. వ్యవసాయానికి ఉపయోగించే డ్రోన్‌ను ఈ సందర్భంగా ప్రయోగాత్మకంగా పరీక్షించి రైతులకు చూపించారు. కార్యక్రమంలో గజపతినగరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, వ్యవసాయ, ఉద్యాన, పట్టు, పశు సంవర్థకశాఖ, డిసిసిబి అధికారులు, ఏడిఏలు మహారాజన్, అన్నపూర్ణ, ఏఓలు, వ్యవసాయ శాఖ సిబ్బంది, నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# 1000 రోజుల విశాఖ స్టీల్ పోరాటం



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): 'విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆపేస్తున్నాం.' అని కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రకటించే వరకు మా పోరాటం కొనసాగుతుందని వెయ్యి రోజులకు ముందే విశాఖపట్నం కమిషనర్ ఆఫ్ పోలీస్ సమక్షంలో ప్రకటించాము. పెద్ద దీక్షా శిబిరం వేస్తున్నారని కొందరు ఆశ్చర్యపోయారు. పోరాట కమిటీ లోని కొంత మంది సభ్యులతో సహా ఎంత కాలం కొనసాగించగలం? అని ఆనాడు అనుమానాలు వచ్చాయి. గుర్తింపు సంఘంలో వున్న సిఐటియు పోరాటాలపై అకుంఠిత విశ్వాసం గల సంస్థ. అందువల్లనే ఈ విషయాన్ని కుండ బద్దలు కొట్టినట్లు సిఐటియు నాయకత్వం స్పష్టంగా ప్రకటించింది. వెయ్యి రోజులైనా చెక్కు చెదరకుండా ఈ ఉద్యమం సాగడానికి కారణం ఏమిటి? 32 మంది ప్రాణాల బలిదానంతో విశాఖ స్టీల్ ఏర్పడింది. ఆనాడు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా కమ్యూనిస్టులదే కీలక పాత్ర. 52 మంది కమ్యూనిష్టు ఎమ్మెల్యేలు, ఏడుగురు ఎంపీలు రాజీనామ చేశారు. 68 గ్రామాలలో నివసించే ప్రజలు ఇళ్ళను, 20 వేల ఎకరాల భూములను త్యాగం చేశారు. ప్రాణాలు ఫణంగా పెట్టి కార్మికులు ఉత్పత్తి పెంచారు. కేంద్ర ప్రభుత్వం ఆనాడు కేవలం రూ. 5 వేల కోట్ల లోపే పెట్టుబడి పెట్టింది. కానీ ఈనాడు స్టీల్‌ప్లాంట్ విలువ 3 లక్ష కోట్లకు పైగా పెరిగింది. దీనిని కాపాడుకోవడానికి విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులు, పరిసరప్రాంత ప్రజలు, రాష్ట్ర ప్రజల మద్దతుతో అకుంఠిత దీక్షతో నిలబడ్డారు. పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులు, ఆఫీసర్లతో ఐక్యత సాధించి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటి ఏర్పడింది. ఈ కమిటీ ఆధ్వర్యంలో నవంబరు 8వ తేదీ నాటికి పోరాటం ప్రారంభించి వెయ్యి రోజులు అయ్యింది. ఆ రోజు విశాఖ స్టీల్ ప్లాంట్ ఎదురుగా కూర్మనపాలెం జాతీయ రహదారి దిగ్బంధనం జరుగుతుంది.

బిజెపి కేంద్ర ప్రభుత్వం 27.1.2021న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నూరు శాతం అమ్మివేస్తామని ప్రకటించారు. దక్షిణ కొరియా దేశానికి చెందిన పోస్కో కంపెనీకి అమ్మి కమీషన్ కొట్టేయాలని బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు పథకం వేశాయి. పోరాట కమిటీ ఆధ్వర్యంలో అమ్మకానికి సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు వేయకుండా కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డుకోగలిగాము. నూరు శాతం అమ్మకం జరగాలంటే మొదట విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించిన అన్ని ఆస్తుల విలువ లెక్కలు కట్టాలి. ప్లాంట్‌లోని యంత్రాలు, భవనాలు, సామానులు, టౌన్‌షిప్, దేశంలోని అన్ని మార్కెట్ యార్డులు, దానిలో స్టీల్, మాదారం, జగ్గయ్యపేట గనులతో సహా అన్ని ఆస్తులకు విలువ కట్టాలి. విలువ కట్టడానికి కేంద్ర ప్రభుత్వం రెండు కమిటీలు వేసింది. ఈ కమిటీలు ప్రత్యక్షంగా ప్రతి ఆస్తిని పరిశీలించి లెక్కలు వేయాలి. రెండేళ్ళ క్రితం ఈ కమిటీ హెలికాప్టర్‌లో బ్లాస్ట్ ఫర్నేస్ వద్ద దిగబోతున్నదని సమాచారం రావడంతో వేలాది మంది స్టీల్‌ప్లాంట్ కార్మికులు అక్కడికి చేరారు. హెలికాప్టర్ వెనక్కి వెళ్ళింది. తిరిగి రాలేదు. విలువ కట్టిన తరువాత రెండవ దశ ఉంటుంది. విలువ ఆధారంగా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కొనడానికి ఆసక్తి వున్నవారు ముందుకు రావాలని రెండు నెలల ముందు పత్రికా ప్రకటన చేయాలి. విలువ కట్టలేదు కాబట్టి ఈ ప్రకటన రాలేదు. మూడవ దశ బిడ్డింగ్ (అమ్మకం). అమ్మకం షరతులు ఉంటాయి. మొదటి, రెండు దశలు కాలేదు కాబట్టి మూడవ దశ ప్రసక్తే రాలేదు.

విశాఖ స్టీల్ అమ్మకం సాధ్యం కాదని బిజెపి ప్రభుత్వానికి తత్వం బోధపడింది. అందువల్ల సంవత్సరం నుంచి విశాఖ స్టీల్‌ను దెబ్బ తీయడానికి బిజెపి ప్రభుత్వం దొడ్డిదార్లు వెతుకుతున్నది. 2021-22లో విశాఖ స్టీల్‌కు నికర లాభాలు రూ. 940 కోట్లు వచ్చాయి. తరువాత సంవత్సరం ముడిసరుకు కొనడానికి ఆ డబ్బులు వుంచకుండా బ్యాంకులకు అప్పులు చెల్లించారు. ముడి సరుకులు కొనడానికి డబ్బులు లేవనే వంకతో విశాఖ స్టీల్ ఉత్పత్తి 40 శాతం తగ్గించారు. దేశంలోని అన్ని స్టీల్‌ప్లాంట్లకు లాభాలు వచ్చాయి. విశాఖ స్టీల్‌కు రూ. 3900 కోట్లు నష్టాలు వచ్చాయి. దేశంలో అన్ని స్టీల్‌ప్లాంట్లకు స్వంత గనులున్నాయి. విశాఖ స్టీల్‌కు 40 సంవత్సరాల నుంచి ఎన్ని పోరాటాలు చేసినా స్వంత గనులు ఇవ్వడానికి కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలు నిరాకరించాయి. ఈ ప్లాంట్ ప్రధాన సమస్య ఇదే. ఈ సమస్యను పరిష్కరించకుండా ప్లాంట్‌ను నిలువునా నాశనం చేయాలని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తున్నది. ఈ విషయాలను పక్కదారి పట్టించడానికి బిజెపి యం.పి. జి.వి.ఎల్ నరసింహారావు "విశాఖ స్టీల్"ను ప్రైవేట్ చేయడం లేదని, పూర్వ వైభవం తెస్తామని ఇటీవల ప్రకటించారు. ఇప్పుడు మూసివేసిన బ్లాస్ట్ ఫర్నేస్-3ను జిందాల్ కంపెనీకి అప్పగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు లేఖ రాశారు. బిఎఫ్-3ను జిందాల్‌కు అప్పగించడం అంటే దొడ్డి దారిన విశాఖ స్టీల్‌ను ప్రైవేట్‌కు అప్పగించడమే. పోరాట కమిటీ దీనిని తీవ్రంగా వ్యతిరేకించడంలో కేంద్ర ప్రభుత్వం వెనుక్కు తగ్గింది. ఇవి బిజెపి మోసపూరిత ప్రకటనలు. బిజెపి మోసాలను ప్రజలకు వివరించడం మన కర్తవ్యం. ప్రజల మధ్య మత వైషమ్యాలు రెచ్చగొట్టి, కుల చిచ్చులు పెట్టి పాలించాలని బిజెపి భావిస్తున్నది.

ఈ వెయ్యిరోజుల పోరాటంలో రాష్ట్ర ప్రజలు, వివిధ సంఘాలు, సంస్థలు విశాఖ స్టీల్‌కు అపూర్వ మద్దతు పలికాయి. కానీ ప్రధాన రాజకీయపార్టీలు నాటకాలాడాయి. బిజెపి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలనే నిర్ణయం దుర్మార్గం. రాష్ట్రంలోని అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు టిడిపి, జనసేన పార్టీలు విశాఖ స్టీల్ ఉద్యమానికి పైకి మద్దతు ఇస్తునే డ్రామాలు ఆడారు. పార్లమెంట్‌లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ చేస్తారా అని ప్రశ్నించడం, బిజెపి మంత్రులు విశాఖ స్టీల్ ను ప్రైవేట్ చేసి తీరుతామని ప్రకటించడం దొంగనాటకం. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు స్వంతగనులు ఎందుకివ్వరు? అని ఒక్క రోజైనా పార్లమెంట్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్, టిడిపిలు బిజెపిని ప్రశ్నించారా? బిజెపి ప్రవేశపెట్టిన బిల్లులన్నిటికీ వైఎస్ఆర్ కాంగ్రెస్, టిడిపిలు మద్దతు ఇచ్చాయి. మా పోరాటాల ఫలితంగా ఆంధ్రప్రదేశ్ ప్రజల మద్దతుతో, కార్మికుల పట్టుదలతో ఈ ఉద్యమం ఎంతకాలమైనా సాగుతుందని విశ్వాసం కలిగింది. కమ్యూనిస్టులు ఒక్కరే 1966 "విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు" ఉద్యమం నుండి నేటి వరకు నికరంగా, నిజాయితీగా విశాఖ స్టీల్ పక్షాన నిలబడ్డారు. బిజెపి ప్రైవేటీకరణ విధానాలను ఓడించాలి. విశాఖ స్టీల్‌ప్లాంట్‌తో పాటు రైల్వే, విద్యుత్, ఆయిల్ రంగం, బ్యాంక్, ఇన్సూరెన్స్‌తో సహా అన్ని రంగాలను కాపాడుకోవాలి. కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆస్తులకు మేనేజర్లు మాత్రమే. ప్రభుత్వ రంగం అంటే ప్రజల ఆస్తి. ప్రజల ఆస్తులను అమ్మే అధికారం వీరికి ఎవరిచ్చారు? ప్రభుత్వ రంగ పరిశ్రమలంటే వీరి తాత ముల్లె కాదు.

విశాఖ స్టీల్‌తో పాటు ఛత్తీస్‌గఢ్ లోని ఒక మిలియన్ టన్నుల సామర్థ్యం కలిగిన "నగర్‌నార్" స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుకు అమ్మాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. బిడ్డింగ్ కూడా పూర్తయింది. జిందాల్ స్టీల్ బిడ్డింగ్‌లో నెం.1గా వచ్చింది. ఈ లోగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. నగర్‌నార్ స్టీల్‌ప్లాంట్‌ను దేశానికి అంకితం చేయడానికి వచ్చిన రోజే సెప్టెంబరు 2023లో ఛత్తీస్‌గఢ్ లోని బిజెపి ఏతర రాజకీయ పార్టీలన్నీ బంద్‌కు పిలుపునిచ్చాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం తోకముడిచి నగర్‌నార్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ చేయటం లేదని అమిత్‌షా రాయిపూర్ వచ్చి ప్రకటించారు. పోరాడితేనే ప్రభుత్వరంగ పరిశ్రమలు కాపాడుకోగలమని నగర్‌నార్, విశాఖ స్టీల్‌ప్లాంట్లు రుజువు చేశాయి. గతంలో సేలం, దుర్గాపూర్ (ఎల్లాయి) స్టీల్‌ప్లాంట్ల అమ్మకాలను పోరాటం ద్వారానే ఆపగలిగాం. పోరాటంతోనే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోగలం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోగలం. ఈ పోరాటాలను యావత్ కార్మికవర్గం మరింత ఉధృతం చేయాలని కోరుతున్నాం.



## ఆంధ్రప్రదేశ్‌లో కమల వికాసం ఎప్పుడో ........!? అవసరం (రాజకీయ పార్టీల చరిత్ర)

సెల్ : 8522825622 సూకల సూర్యప్రకాష్

(నిన్నటి తరువాయి)

అందుకు ఆర్థిక అంశాల పరంగానే వర్గాలుగా విభజించడం వల్ల ఆ వర్గాల మధ్య పోటీ ఏర్పడి పెట్టుబడిదారులు బయలుదేరి క్యాపిటలిస్ట్ సిద్ధాంతాలతో భూస్వామ్యవాదంతో శ్రామిక, కార్మిక, కర్షక వర్గాల శ్రమదోపిడి కారణంగా విప్లవాలు మొదలై ధనస్వామ్య వ్యవస్థలో సమానత్వం, సామ్యవాదాలకోసం పోరాటాలు జరిగాయి.

సమాజంలో సమానత్వం గురించి చెప్పే సోషలిజమ్ (సామ్యవాదం) సిద్ధాంతం ఏర్పడి పాశ్చాత్య దేశాలలో పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాట పద్ధతిని ప్రోత్సహించే కమ్యూనిజం ఉద్భవించింది.

ప్రకృతిలో ఏ రెండూ సమానంగా ఉండవు. అలాగే ఏ పరుగు పందెంలో కూడా పోటీదారులు అందరూ కూడా ఫస్ట్ రావడం సాధ్యం కాదు.

అదే విధంగా పరీక్షపెట్టి అందరూ ఒక్కలాగ ఫలితం సాధించాలనడం సాధ్యమేనా? ఏ మాత్రం అనుభవం లేనివారు కూడా అది సాధ్యం కాదని చెప్పడానికి సంకోచించరు. అటువంటిది ప్రపంచ మానవులంతా ఒక్కలా, ఒకేలా ఉండాలంటే ఎలా?

ఉన్నవాడిని దోచి లేనివాడికి పెట్టు అనే కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఆచరణలో ఒక్కసారి చేస్తారు. మళ్ళీ కాలక్రమంలో వ్యత్యాసాలు వస్తాయి, మళ్ళీ ఉన్నవాడి దగ్గర తీసుకొని లేనివాడికి పెడతారు. మళ్ళీ వ్యత్యాసాలు వస్తాయి. అలా మళ్ళీమళ్ళీ ఎన్ని సార్లు చేస్తారు?

అందుకే భారతీయ సనాతన ధర్మం ఒక చక్కని ఆచరణ యోగ్యమైన పథక రచన చేసింది. అదే పాశ్చాత్యులు భౌతిక దృక్పధం ఆధారంగా మనిషికి ఉన్న ఆర్థిక స్తోమతనుబట్టి సమాజాన్ని వర్గాలుగా విభజిస్తే, భారతీయులు మాత్రం భౌతికాంశం అయిన ఆర్థిక స్తోమతను కాకుండా వారు చేసే పనిని బట్టి వర్ణవ్యవస్థను రూపొందించారు.

భారతీయుల దృష్టిలో మానవుడు అంటే భౌతికంగా కనిపించే శరీరం మాత్రమేకాదు. శరీరంతో పాటు మనస్సు, బుద్ధి, ఆత్మ ఈ నాలుగింటి సమాహారమే మనిషి.

పాశ్చాత్యులు ప్రతిపాదించిన సోషలిజమ్‌లోను, సోషలిజమ్‌ను సాధించడానికి రూపొందించిన కమ్యూనిజమ్‌లోను, కమ్యూనిజమ్ నుండి ఏర్పడిన మావోయిజమ్ కానీ, రాడికలిజమ్ కానీ మానవుడి యొక్క భౌతిక అవసరాలైన కూడు, గూడు, గుడ్డ వంటి వాటిని మాత్రమే చూడగలిగాయి. వాటికోసం మరియు వాటిలో మానవులందరికీ సమానంగా అందచేయటం వరకు మాత్రమే చూడగలిగారు. అంటే పాశ్చాత్యుల దృష్టిలో దృక్పథంలో భౌతిక అవసరాలు తప్ప అంతకన్నా గొప్ప విషయం ఏదీలేదు.

కానీ! భారతీయ ఋషులు మానవుడిని, ఈ చరాచర జగత్తును భౌతికంగా చూడలేదు. ఓ చైతన్య స్వరూపంగా చూసింది అందుకే సమాజాన్ని ఆధ్యాత్మిక కోణంలోనే చూసారు. కాబట్టి తాత్విక ధృక్పధంతో చూస్తే బేధాలు ఏవైనా బాహ్యంగానే కనిపిస్తాయి.

అందుకే వర్ణవ్యవస్థలో ఎన్ని భేదాలు బాహ్యంగా కనిపించినా అంతా ధర్మంతో ముడివేయబడి ఒక సువ్యవస్థను నిర్మించింది. వర్ణవ్యవస్థ అయినా, వర్ణాశ్రమ ధర్మాలైనా, ధర్మం ఆధారంగా వ్యక్తి జీవించడానికి ధర్మంతో అర్థాన్ని (ధనాన్ని) సంపాదించి కామం (కోరికలను) తీర్చుకొని మోక్షాన్ని సాధించాలని, అదే సమానత్వం అని భారతీయ సిద్ధాంతాలు చెప్పాయి.

అంటే భౌతికాంశాలలో సమానత్వం సాధించడం కాదు సామ్యవాదమంటే అందరిలోను ఆనందం, సంతృప్తి సాధించడం. భౌతికాంశాలలో సమానత్వం సాధించడం ఎప్పటికీ సాధ్యపడదు. కానీ! మనిషిలో ఆనందం, సంతృప్తి సాధించడం మాత్రం భారతీయ జీవన విధానం ద్వారానే సాధ్యం.

విశ్వమానవులందరికీ, ఎప్పటికీ ఆచరణీయమైన ఏకాత్మతా మానవతావాదాన్ని ఒక ఋషి, ఒక సత్యాన్వేషి, ఒక రాజనీతిజ్ఞుడు, స్థితప్రజ్ఞుడు, కోట్లాదిమందికి స్ఫూర్తి ప్రదాత అయిన పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించారు.

ప్రతివ్యక్తినీ అభివృద్ధివైపు, సమృద్ధివైపు, సంతోషం వైపు తీసుకుపోగల ఉత్తమ సిద్ధాంతం "ఏకాత్మ మానవతావాదం". ఒక దేశానికో, ఒక జాతికో, ఒక మతానికో కాకుండా అన్ని కాలాల్లో విశ్వమానవ కళ్యాణానికి ప్రతిపాదించబడింది.

కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (CPI)

19వ శతాబ్దంలో యూరప్ ఖండంలో రూపుదిద్దుకున్న సామ్యవాదం, కమ్యూనిజం సిద్దాంతాల ఆధారంగా 20వ శతాబ్దంలో ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో కమ్యూనిస్టు రాజకీయ పార్టీలు ఆవిర్భవించాయి. ఇదే క్రమంలో మన భారతదేశానికి సంబంధించి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (CPI) 1920వ సం.. అక్టోబర్ 17వ తేదీన రష్యాలోని తాష్కెంట్‌లో ఏర్పడింది. CPI పార్టీ ఆవిర్భావం వెనుక కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ కీలకపాత్ర పోషించింది.

ఈ విధంగా విదేశీయులచే ప్రతిపాదించబడిన కమ్యూనిస్టు సిద్దాంతాల ఆధారంగా ఒక విదేశీ గడ్డపై కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (CPI) పురుడు పోసుకోవడం వల్ల బ్రిటీష్ పాలనలోని భారతదేశంలో రెండవ అంతర్జాతీయ పార్టీగా CPI ఏర్పడింది.

కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక సభ్యులుగా శ్రీ ఎమ్.ఎన్.రాయ్ ఈయన సహచరి (సతీమణి) అమెరికా దేశస్థురాలు శ్రీమతి ఎల్లిన్ ట్రెండ్ మరియు శ్రీ అబానీ ముఖర్జీ ఈయన సహచరి (సతీమణి) రష్యా దేశస్థురాలు శ్రీమతి రోసా ఫిటింగో మరియు మహమ్మద్ ఆలీ, మొహమ్మద్ షషీఖ్‌లు కీలక భూమిక పోషించారు.

ఈ వ్యవస్థాపక కమ్యూనిస్టు సభ్యులలో ఎవ్వరిలోను భావసారూప్యం కానీ, ఏకాభిప్రాయం కానీ లేవు. అదే విధంగా వీరంతా వివిధ దేశాలలో కమ్యూనిస్టులతో కలిపి పని చేసినవారే.

**ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే మన దేశంలో స్వాతంత్రోద్యమం**

ఉధృతంగా సాగుతున్న సమయంలో మన దేశంలోని ముస్లిమ్‌లు టర్కీ దేశంలో ఖలీఫా పాలనను పునరుద్ధరించాలని, టర్కీ దేశంలోని ముస్లిమ్‌లకు మద్దతుగా మనదేశంలో ఖిలాఫత్ ఉద్యమం ప్రారంభిస్తే దానికి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరపున గాంధీగారు మద్దతు ప్రకటించారు. **(మిగతా రేపటి సంచికలో)**

# దీపావళి కొనుగోళ్లకు 18,000 మంది పోలీస్ సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు



దీపావళి సమీపిస్తున్న తరుణంలో కొనుగోళ్ల రద్దీ పెరగడంతో గ్రేటర్ చెన్నై సిటీ పోలీస్ (జసిపి) ప్రజల భద్రత మరియు భద్రత కోసం 18,000 మంది పోలీసులను మోహరించింది.దీపావళి హ్యాపీగా జరుపుకోండి

చెన్నై కమీషనర్ ఆఫ్ పోలీస్ సందీప్ రాయ్ రాథోడ్ ఆదేశాల మేరకు, ప్రజలు భారీ సంఖ్యలో గుమికూడే నగరంలోని వాణిజ్య ప్రాంతాల్లో విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. టి.నగర్, పాండిబజార్, పురసవల్కం, మైలాపూర్, ఫ్లవర్ బజార్, వాషర్‌మెన్‌పేట, కోయంబేడులో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. రద్దీని నివారించడానికి, రద్దీని నియంత్రించడానికి, నేరాల నివారణకు మరియు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి భద్రతా చర్యలు అమలులో ఉన్నాయి.

శాంతి భద్రతలు, క్రైమ్ మరియు ట్రాఫిక్ విభాగాలతో పాటు ఆర్మ్‌డ్ రిజర్వ్, తమిళనాడు స్పెషల్ పోలీస్ (టిఎస్‌పి) మరియు హోంగార్డులతో సహా 18,000 మంది పోలీసు సిబ్బందిని మోహరించారు. ప్రజల భద్రత మరియుజాగ్రత్తలు తీసుకోండి..

టి.నగర్, వాషర్‌మెన్‌పేట, కిల్‌పాక్, ఫ్లవర్ బజార్ అనే నాలుగు చోట్ల మొత్తం 17 తాత్కాలిక వాచ్ టవర్లు ఏర్పాటు చేశారు. 21 బైనాక్యులర్ల ద్వారా జనాలను పర్యవేక్షించేందుకు రొటేషన్ ప్రాతిపదికన పోలీసు సిబ్బందిని నియమించారు. టి.నగర్, వాషర్‌మెన్‌పేట, పురసవల్కం, ఫ్లవర్ బజార్ ప్రాంతాల్లో ఐదు తాత్కాలిక పోలీస్ కంట్రోల్ రూమ్‌లు, 10 తాత్కాలిక హెల్ప్ డెస్క్‌లను కూడా ఏర్పాటు చేశారు. టి.నగర్, వాషర్‌మెన్‌పేటలో అదనంగా 42 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా ఈవెంట్‌లను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నారు. అదనంగా, టి.నగర్ మరియు ఫ్లవర్ బజార్ ప్రాంతంలో జనాలను పర్యవేక్షించడానికి మరియు నేరాలను నిరోధించడానికి డ్రోన్ కెమెరాలను మోహరిస్తున్నారు.

నేర కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు, ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ యాప్ ద్వారా తెలిసిన నేరస్థులను తనిఖీ చేసేందుకు రొటేషన్ ప్రాతిపదికన పోలీసు సిబ్బందిని మోహరిస్తున్నారు. నేరాలను నిరోధించడానికి మరియు నిరోధించడానికి సమాచారాన్ని పంచుకోవడానికి పోలీసు సిబ్బంది కోసం ప్రత్యేకమైన వాట్సాప్ గ్రూప్ కూడా సృష్టించబడింది.

వాణిజ్య సంస్థలు, షాపింగ్ మాల్స్ మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో రద్దీగా ఉండే ప్రదేశాలలో మొబైల్ ఎక్స్-రే లగేజీ స్కానర్ వాహనాల ద్వారా ప్రజల బ్యాగ్‌లను యాదృచ్ఛికంగా తనిఖీ చేస్తున్నారు. చైన్ స్నాచింగ్‌లను నిరోధించేందుకు మహిళలు కండువాలు ధరించాలని కోరారు.

భద్రతా నినాదాలు మరియు నేరాల నివారణ ముందు జాగ్రత్త చర్యల నినాదాలు విస్తృత LED స్క్రీన్‌ల ద్వారా మరియు 19 పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ల ద్వారా ప్రసారం చేయబడుతున్నాయి. ప్రజలకు భద్రత, ట్రాఫిక్ జామ్‌లకు గురికాకుండా, వారి మొబైల్ ఫోన్, డబ్బు, నగలు మరియు ఇతర వస్తువులను రక్షించడంపై సూచనలు ఇవ్వబడతాయి.

# పార్వేటి మండపం కూల్చివేత నిర్ణయంపై టీటీడీ ఈఓకు లీగల్ నోటీస్ పంపాం

తిరుమల: పార్వేటి మండపం కూల్చేవేయాలని నిర్ణయం తీసుకోవడంపై నిన్ననే టీటీడీ ఈఓకు లీగల్ నోటీస్ పంపామని బీజపి అధికార ప్రతినిధి భానుప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. నేడు ఆయన పార్వేటి మండపాన్ని సందర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కూల్చివేయాలని నిర్ణయం తీసుకోవటం వెనుక ఉన్న అందరిపైనా వారం రోజుల్లో కోర్టులో కేసు వేయనున్నామన్నారు. టీటీడీ ఈవో చాలెంజ్ చేశారు. పార్వేటి మండపం వద్ద చర్చకు రమ్మంటూ టీటీడీ ఈవో ఛాలెంజ్ చేశారు కాబట్టే వచ్చామని భానుప్రకాశ్ రెడ్డి తెలిపారు. టీటీడీ ఈవో రాజకీయ నాయకుడిలా ఛాలెంజులు విసరటం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా భవిష్యత్తులో ఇలా జరగదని టీటీడీ ఈవో హామీ ఇవ్వాలన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి బీజీపీ రాష్ట్ర అధ్యకురాలు పురందేశ్వరి ఈరోజు లేఖ రాశారని భానుప్రకాశ్ రెడ్డి తెలిపారు.

# 82 వ వార్డులో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ అనకాపల్లి 82 వార్డులో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమము తెలుగుదేశం పార్టీ అనకాపల్లి ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ ఆదేశాలు మేరకు భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం విజయరామరాజు పేటలో జరిగింది. 82వ వార్డు ఇంచార్జ్ పోలవరపు త్రినాథ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో , తెలుగుదేశం నాయకుడు ఆళ్ల రామచంద్ర రావు, యూనిట్ ఇంచార్జ్ దాడి జగన్ , పిట్ల రాజు, వాడు పోయిన అప్పారావు, తుట్ట పెంట్టరావు, అండిబోయిన శేషు, పిట్ల అప్పలనర్స, పిల్లి లక్ష్మి ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది.

# శ్రీ అయ్యప్ప స్వామి నిత్య అన్నదాన మహా నారాయణ సేవ కార్యక్రమంలో పాల్గొన్న కోరాడ రాజబాబు



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** శ్రీ అయ్యప్ప స్వామి నిత్య అన్నదాన మహా నారాయణ సేవ కార్యక్రమంలో పాల్గొన్న భీమిలి నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి కోరాడ రాజబాబు తగరపువలస బంగ్లా మెట్టపై జరుగుతున్నటువంటి శ్రీ అయ్యప్ప స్వామి నిత్యాన్నదాన మహానారాయణ సేవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ మరియు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కోరాడ రాజబాబు అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ఉన్నారు గ్రామ దేవత శ్రీ దుర్గాలమ్మ తల్లి అమ్మవారిని దర్శించి ఆలయఅభివృద్ధికి తాను కూడా సహాయ సహకారాలు అందిస్తానని ఆలయ పునర్నిర్మాణ కర్త తమ్మిన సూరిబాబుకు తెలియజేసినందుకు శ్రీ దుర్గాలమ్మ తల్లి అయ్యప్ప సేవ పీఠం తరవున కోరాడ రాజబాబు కి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నాయకులు పిట్ట సురేష్ ,చిలకా నరసింహారావు ,మద్దెల దేవుళ్ళు , నరవ రామారావు, మద్దుల సుబ్బారావు, దిండి వెంకటేష్ , యువత అధ్యక్షులు గోరే సదానంద , పీఠం గురు స్వాములు దంతల పైడిరాజు , కుమిలి తిరుపతిరావు , వ్యవసాయ , వెలసాదు శిల సాదు , భీమిలి నియోజకవర్గం వాణిద్య విభాగ ప్రధాన కార్యదర్శి గుండు చిన్న బాబు తదితర వార్డు నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొనడం జరిగింది.

# ప్రజా సంఘాల ఐక్యవేదిక నూతన కార్యవర్గం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా ప్రజాసంఘాల ఐక్యవేదిక నూతన కార్యవర్గాన్ని మున్సిపల్ మాజీవైస్ చైర్మన్ విల్లూరి పైడారావు, నూకాంబికా దేవస్థానం మాజీ చైర్మన్ బొడ్డేడ అప్పారావు పర్యవేక్షణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దనున్న సిపిఎం భవనంలో వివిధ సంఘాలకు చెందిన 26 మంది నేతలతో నూతన కార్యవర్గం ఎన్నిక, తర్వాత అభినందన సభ జరిగింది.నూతన కార్యవర్గంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ విల్లూరి పైడా రావు ముఖ్య సలహాదారులుగా, బొడ్డేడ అప్పారావు గౌరవ అధ్యక్షులుగా వ్యవహరిస్తారు. ఇక అధ్యక్షుడిగా బొట్టా చిన్నియాదవ్, ప్రధానకార్యదర్శిగా ఆళ్ల ప్రవీణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్గా మాణిక్యాలరావు, ఉపాధ్యక్షులుగా బండి అప్పారావు, కోశాధికారిగా బొడ్డు సోమరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆడారి బుచ్చురాము, సహాయ కార్యదర్శులుగా పొట్ల అప్పారావు, బొబ్బిలి గోవిందరాజులు, బుగ్గిడి నూక అప్పారావు, కుంచ చిన్ను, నరిసే చిరంజీవి, కార్యవర్గ సభ్యులుగాముగడా అప్పారావు, పల్లా సత్యఅప్పారావు, బర్నికాన సూరిబాబు, భరినికాన మురళీకృష్ణ, కొత్తర నూకరాజు, బొడ్డేడ భాస్కర్, ఉప్పల సాయి, కొణతాల రాజు, అమలకంటి శంకర్, అమ్మోజి శ్రీను, చింత నానాజీ, మానేపల్లి శ్రీనివాసరావు, శ్రీకాకుళం గణపతి ప్రజాసమస్యలపై వ్యవహరిస్తారు. అనంతరం పోరాటం కొనసాగించాలని ఆకాంక్షిస్తూ, నూతన కమిటీకి విల్లూరి పైడా రావు అభినందనలు తెలిపారు.

# ఆరవ జాతీయ చిత్రకళా పోటీలలో ఉద్దండపురం విద్యార్థులకు స్థానం



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం లో ఇటీవల నిర్వహించిన ఆరవ జాతీయ చిత్రకళా పోటీలలో ఉద్దండపురం హైస్కూలు విద్యార్థులు నలుగురు ఎంపికయినట్లు హెచ్.ఎమ్.డి.సత్యారావు తెలిపారు. విజేతలకు మంగళవారం పాఠశాల ఆవరణలో ప్రశంసాపత్రములు, గోల్డ్ ప్లేటెడ్ సిల్వర్ మెడల్స్ జ్ఞాపికలను అందజేశారు. పాఠశాల లో పోటీలను నిర్వహించి జాతీయ స్థాయి పోటీల కు పంపగా నలుగురు విద్యార్థులు ను ఎంపికచేసినట్లు ఆయన తెలిపారు. వీరితో పాటు పోటీలలో పాల్గొన్న పది మందికి పార్టిసిపేషన్ సర్టిఫికేట్ లు అందజేశారు. దీనిలో భాగంగా చోడవరంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యారావును. ఘనంగా సత్కరించారు. అనంతరం పాఠశాల లో మంగళవారం జరిగిన సమావేశంలో సమాజాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించే అద్భుతమైన చిత్రకళానైపుణ్యంలో ఉద్దండపురం హైస్కూలు నుండి నలుగురు ఎంపిక కావడం తో పాఠశాల చైర్మన్ వెలమశెట్టి శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. అందరూ చదువుతోపాటు కళలను కూడా నేర్చుకుంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వారు పేర్కొన్నారు, చిన్నారులలో నిగూఢంగా దాగిఉన్న ప్రతిభను బయటకు వెలికితీయాలంటే ఇటువంటి పోటీలు దోహదపడతాయని అన్నారు.



# వైకాపా ప్రభుత్వ కక్ష సాధింపులకు చెక్ పెట్టండి

## గవర్నర్‌కు తెదేపా నేతల విజ్ఞప్తి

విజయవాడ: జగన్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు, చేస్తోన్న సామాజిక అన్యాయంపై తెదేపా నేతలు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు ఫిర్యాదు చేశారు. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, పీతల సుజాతతో పాటు నేతలు ధూళిపాళ్ల నరేంద్ర, అశోక్‌బాబు తదితరులు విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు.

రాష్ట్రంలో గత 53 నెలల వైకాపా ప్రభుత్వ అరాచక పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరిగాయంటూ గవర్నర్‌కు లోకేశ్ వివరించారు. బీసీ వర్గానికి చెందిన అమర్నాథ్ గౌడ్ నోట్లో పేపర్లు కుక్కి, పెట్రోల్ పోసి వైకాపా నేతలు తగులబెట్టారన్నారు. దళిత వర్గానికి చెందిన శ్యామ్‌కుమార్‌పై దాడి చేసి మూత్రం పోసిన ఘటననూ గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి ఆయనకు వివరించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రతిపక్షాలపై జగన్ ప్రభుత్వం సాగిస్తున్న కక్ష సాధింపు చర్యలను గవర్నర్‌కు నేతలు నివేదించారు. వాలంటీర్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు అడ్డుకట్ట వేసేలా రూపొందించిన 17ఏ సెక్షన్‌ను సైతం తుంగలో తొక్కి.. గవర్నర్ వ్యవస్థను కూడా గౌరవించకుండా జగన్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును నేతలు వివరించారు. ఎటువంటి ఆధారాలు లేకపోయినా చంద్రబాబును 53 రోజుల పాటు జైలులో నిర్బంధించిన విధానాన్ని లోకేశ్, అచ్చెన్నాయుడు తదితరులు గవర్నర్‌కు నివేదించారు. వైకాపా ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు చెక్ పెట్టేలా రాజ్యాంగంలోని ఆర్టికల్ 355 ప్రకారం రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని తెదేపా నేతల బృందం ఆయనకు విజ్ఞప్తి చేసింది.

# శ్రీ చైతన్య టెక్నో స్కూల్ పిల్లలకు పోలీస్ ట్రాఫిక్ రూల్స్ గురించి అవగాహన సదస్సు నిర్వహించిన ఎంవిపి ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఈరోజు ఎంవిపి లో ఉన్న శ్రీ చైతన్య టెక్నో స్కూల్ పిల్లలకు పోలీస్ ట్రాఫిక్ రూల్స్ గురించి అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది రోడ్ రూల్స్ సిగ్నల్ లైట్స్ సిగ్నల్ సింబల్స్ మరియు సెక్షన్స్ పిల్లలకు అవగాహన అందించడం జరిగింది అదేవిధంగా రోడ్డుపై జరిగే ప్రమాదాల కోసం కూడా పిల్లలకు చిన్న తనము నుంచి అలవాటు చేయడం వల్ల భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదాలు గురవకుండా ఏ విధంగా రోడ్ల పైన ప్రయాణం చేయాలో పోలీస్ సిబ్బంది స్కూల్ పిల్లలకు క్లుప్తంగా వివరించడం జరిగింది నేటి బాలలే రేపటి పౌరులు అనే నినాదంతో ఈ రోడ్ సేఫ్టీ మరియు ట్రాఫిక్ అవేర్నెస్ ప్రోగ్రాం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమమును ఎంవిపి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది అయినా ఎస్ ఐ వి కనకారావు ఆర్ఎస్ఐ బి తిరుపతిరావు బి స్వామి నాయుడు సూర్యనారాయణ బీవీ నాగేశ్వరరావు మరియు స్కూల్ ప్రిన్సిపల్ ఎన్ వి రమణి నిర్వహించారు.

# చంద్రబాబు అధికారంలోకి వస్తే మహిళలకు ఆర్థిక చేయూత



యలమంచిలి, (విశాఖ సమాచారమ్): యలమంచిలి మండలం ములకలాపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపీపీ కొలుకులూరి విజయబాబు,వైస్ ఎంపిపి గొన్నాబత్తుల నాగేశ్వరరావు(శేషు)ల ఆధ్వర్యంలో మంగళవారం నాడు బాబు షూరిటీ... భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతీ ఇంటికి వెళ్తూ కరపత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ మ్యానిఫెస్టోని వివరిస్తూ బాబు షూరిటీ... భవిష్యత్ గ్యారెంటీ ఎలా సాధ్యమో తెలిపారు.పేద ప్రజల ఆర్థిక స్థితిని అభివృద్ధి పరిచే విధంగాను ప్రతీ మహిళకు సుమారు రూ. లక్ష వరకు లబ్ధి చేకూరే విధంగా తమ పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆలోచన చేస్తున్నారన్నారు.మాజీ ఎంపీపీ కొలుకులూరు విజయబాబు, మాజీ వైస్ ఎంపీపీ గొన్నాబత్తుల నాగేశ్వరరావు(శేషు), ఏటికొప్పాక మాజీ సర్పంచ్ కాండ్రకోట చిరంజీవి, పోతిరెడ్డిపాలెం సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, బయ్యవరం మాజీ సర్పంచ్ గెంజి శ్రీనివాసరావు, ఏటికొప్పాక మాజీ కో ఆప్షన్ ఊడి రామకృష్ణ,కంబాల శ్రీను,ప్రగడ నాని,తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

## నూకాంబిక ఆలయానికి మూడు లక్షలు విరాళం అందజేసిన శ్రీరామ్



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి కోరిక మేరకు దేవస్థానం ప్రాంగణం లో వున్న మౌలిక సదుపాయలు మెరుగుపరిచే నిమిత్తం 3 లక్షల రూపాయిల విరాళం అందించిన ప్రముఖ యువ వాణిజ్యవేత్త, ఎస్ డి గ్రూప్స్ అధినేత కాండ్రేగుల శ్రీరామ్ ని ధర్మకర్తలు కలసి అమ్మవారి తరపున ఆశీర్వాదం అందించి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా దేవస్థాన చైర్మన్ కొణతాల మురళీకృష్ణ మాట్లాడుతూ.. అనకాపల్లి, విశాఖ జిల్లాలలో నిర్వహించిన ఎన్నో అధ్యాత్మిక, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు కాండ్రేగుల శ్రీరామ్ అండగా నిలిచారని.. తనకి ఆ నూకాంబిక అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని తెలియజేసారు. ఎస్ డి గ్రూప్స్ అధినేత కాండ్రేగుల శ్రీరామ్ మాట్లాడుతూ శ్రీ కృష్ణ భగవానుని ఆశీస్సులతో నాకు శక్తి వున్నంతవరకు ఇలాంటి కార్యక్రమాలకు నా వంతు చేయూత అందిస్తానని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు కొండూరి రవీంద్రనాథ్, పీలా లక్ష్మి శ్రీనివాస్, మల్లవరపు ఈశ్వర్రావు, యనమండ్ర శ్రీనివాసు లు పాల్గొన్నారు.

## స్టేట్ ఆడిట్ డైరెక్టర్ ఇన్‌చార్జిను తొలగిస్తూ ఏపీ సర్కార్ ఆదేశాలు



అమరావతి, (విశాఖ సమాచారమ్): స్టేట్ ఆడిట్ డైరెక్టర్ ఇన్‌చార్జి బాధ్యతల నుంచి ఆర్. హరిప్రకాశ్‌ను తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్థిక శాఖలో రిపోర్టు చేయాల్సిందిగా హరిప్రకాశ్‌ను ఆదేశిస్తూ ఆర్థిక శాఖ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది. అలాగే ఆ శాఖలోని జాయింట్ డైరెక్టర్ విజయభారతికి స్టేట్ ఆడిట్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వేధింపులు, అక్రమ బదిలీలపై ఆర్.హరిప్రకాశ్‌పై గత కొంతకాలంగా ఆడిట్ ఉద్యోగుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆర్.హరిప్రకాశ్‌ను స్టేట్ ఆడిట్ డైరెక్టర్‌గా తొలగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## నేడు మహారాణిపేట మండల స్థాయి "జగనన్నకు చెబుదాం" కార్యక్రమం

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన బుధవారం మహారాణిపేట మండలంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేపు ఉదయం 10 గంటల నుండి మహారాణిపేట తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న టర్నర్ చౌల్ట్రి కళ్యాణ మంటపం నందు నిర్వహిస్తున్నట్లు తెలియజేసారు . ప్రతి సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం మండల స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాటు చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా HODలు , జీవీఎంసీ అధికారులు , మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది తప్పకుండా హాజరు కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని మహారాణిపేట మండలం లోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని తమ సమస్యలు అధికారులకు తెలియజేసి , పరిష్కరించుకోవాలని కోరారు.

# విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన సీఎం జగన్



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి హయాంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్చేందుకు మన బడి నాడు నేడు. కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని వైసీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ పేర్కొన్నారు. ముందుగా గ్రామంలోగల పైడితల్లమ్మ అమ్మవారిని రత్నాకర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు జీవీఎంసీ విలీన గ్రామం కొండకొప్పాకలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, ఎంపీపీ స్కూల్‌ను రత్నాకర్ మంగళవారం సందర్శించారు. ఇక్కడ విద్యార్థులకు అందుతున్న బోధన, సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాడు - నేడు కింద దశల వారీగా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నారన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడమే సీఎం జగన్ లక్ష్యంగా చేసుకున్నారని, దానికి అనుగుణంగానే ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతి సౌకర్యాలు కల్పిస్తూ పేద విద్యార్థులకు మంచి విద్యనంచడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్క విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని రత్నాకర్ కోరారు. గ్రామంలో పారిశుథ్యం, మురుగు కాలువలను రత్నాకర్ పరిశీలించారు. గ్రామంలో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి సొంత నిధులతో ఫ్యాన్లు, లైట్లు వితరణ...

కొండ కొప్పాక గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని వైసీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ పరిశీలించారు. దీనిలో భాగంగా ఇక్కడి అంగన్‌వాడీ కేంద్రంలో కరెంటు సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రానికి 2 ఫ్యాన్లు, 2 లైట్లు లేకపోవడంతో తన సొంత నిధులతో ఇక్కడ ఏర్పాటు చేస్తామని రత్నాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వామాల కాశీ, బొడ్డపాటి చినరాజారావు, పొలిమేర బాలాజీ, ఇంటి త్రినాధ్, మొల్లి రమణబాబు, నెట్టిమి రామచంద్ర, చింతల రాము, బత్తిన అప్పారావు, ఇండిగా నాగు, వానపల్లి గంగాధరరావు, పి.శోభ, ఒమ్మి శ్రీను, సాలాపు నాగేంద్రబాబు, ఆడారి రవికుమార్, నందవరపు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏమని పిలవాలి?

అడవిలో అనాగరికంగా
తిరిగే ఆదిమానవుడా
అజ్ఞానంలో అలమటించేవు
పరువు, మర్యాద, సభ్యత, సంస్కారం
బంధాలు, బంధుత్వాలు, సాంప్రదాయాలు
కట్టుబాట్లు నేర్పి తండాలనుండి
అయోమయం నుండి బైటపడేశారు
పెద్దలు!
నీతి, నియమం, వావి, వరుస
చదువు, సంధ్య, మంచితనం
విజ్ఞాన సముపార్జన
అజ్ఞానం విడచి,, సమాజంలో
సగౌరవంగా మసలుతున్నావ్!
వావివరుసలు మరచి
కామానికి కళ్ళులేవనేసామెత
నిజం చేస్తూ 'స్త్రీ'లపై అత్యాచారాలకి
పాల్పడుతున్న 'ఎయిడ్స్' వ్యాధిని
వ్యాపింపచేస్తున్న నిన్ను
పసిపిల్లలపై అకృత్యాలకి పాల్పడుతున్న
నిన్ను ఏమని పిలవాలి?
పురుషాహంకారా! కామాంధకారా!
మానవమృగమా!

జీఎస్‌కె సాయిబాబా
సెల్: 7416511995

# అధ్వానంగా ఉన్న ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్ తమ ప్రభుత్వం అని ముఖ్యమంత్రి, మంత్రులు, శాసనసభ్యులు, వల్లె వేయని క్షణం లేదని సంక్షేమానికి బడ్జెట్లో అత్యధిక నిధులు ఖర్చు చేస్తున్నామని బస్తీమే సవాల్ అని అంటున్నారని, సాంఘిక సంక్షేమ సంఘం హాస్టల్స్ స్కూల్స్ అధ్వాన స్థితిపై ఏం సమాధానం చెప్తారని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సంక్షేమ బడుల్లో చదువుతున్న సామాజికంగా బడుగు బలహీన వర్గాల పేద పిల్లలేనని డబ్బున్న మారాజుల పిల్లలు ఎలాగూ కార్పొరేటర్ సంస్థల స్కూల్స్ కి వెళ్తారని ఎస్సీ ఎస్టీ, బిసి మైనార్టీస్ తరగతులకు పిల్లలకు దిక్కైన సంక్షేమ పాఠశాలల్లో కనీస సదుపాయాలు కల్పించకుండా ఎలా విద్యను అభ్యసిస్తారు,ఇదేనా సామాజిక సాధికారత న్యాయం,అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య,ఆంగ్ల మాధ్యమం జగన్ ఈ ఆశయాల వైపు వెల్ఫేర్ స్కూళ్లను వెల్ఫేర్ స్కూల్లను సంక్షోభంలో నెట్టివేస్తే ఎలా సిద్ధిస్తాయి జగన్ ప్రభుత్వాన్ని



వెంకటరావు నిలదీశారు. ప్రస్తుతం అధికార వైసిపి రాష్ట్రవ్యాప్తంగా సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహిస్తున్నారని, సంక్షేమ హాస్టలను సందర్శించి అక్కడ స్కూల్ పిల్లలు అగచాట్లను బాధలు వారి కన్నీటి గాథలను తెలుసుకున్న తర్వాత సామాజిక సాధికారిక బస్సు యాత్రకు విలువ ఉంటుందని అన్నారు. నవరత్నాలలో కొన్ని పథకాలకు నగదు బదిలీ చేసి అదే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీస్ పేదల సంక్షేమం అనడం ప్రభుత్వ పాక్షిక దృష్టి కోణమని వెంకటరావు అన్నారు. సకల సౌకర్యాలతో వెల్ఫేర్ స్కూల్స్ ఏర్పాటు చేసినప్పుడే విద్య సాధ్యమవుతుందని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు ఇవ్వకుండా,పాలు,కూరగాయలు, గ్యాస్ సరఫరా చేసే వెండర్లకు బిల్లులు బకాయిలు పేరపెట్టి మరుగుదొడ్లు శుభ్రం చేసే పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు ఇవ్వకుండా వెల్ఫేర్ స్కూల్లో చదువుకునే పిల్లలు ఐఏఎస్, ఇంజనీర్లు, సైంటిస్టులు కావాలని కోరుకోవడం ఆయా తరగతులను వంచించడమే అవుతుందని మినుకు మినుకు మనే లైట్లు, విరిగిపడే స్లాబులు పెచ్చులు, రెక్కలు విరిగిన ఫ్యాన్లు, బయటకు వెళ్లే వైర్లు డోర్లు లేని మరుగుదొడ్లు, మూలనపడ్డ ఆర్‌ఓ ప్లాంట్లు తుక్కు పెట్టిన ట్రంకు పెట్టెలు, ప్రహరీ గోడలు లేని భవనాలు, ఇది సంక్షేమ సంఘం హాస్టల్ ల పరిస్థితి అని ఇప్పటికైనా జిల్లా మంత్రులు గుడివాడ అమర్నాథ్ బూడి ముత్యాల నాయుడు కళ్ళు తెరిచి హాస్టల్ లను సందర్శించి అక్కడ పరిస్థితులను గమనించి, అప్పుడు సామాజిక సాధికారిక బస్ యాత్రలు చేస్తే అప్పుడు అర్థము, సార్థకత ఉంటుందని వెంకటరావు హితువు పలికారు. విలేకరుల సమావేశంలో పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కుప్పిలి జగన్ బీ బీసీ సెల్ పార్లమెంట్ అధికారి ప్రతినిధి విల్లూరి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ముందు వైఎస్ షర్మిలకు ఊహించని షాక్

ఎన్నికల్లో వైఎస్సార్టీపీ పోటీ చేయట్లేదని.. కాంగ్రెస్ పార్టీకి బేషరతుగా మద్దతిస్తున్నట్లు ఆ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ప్రకటించిన సంగతి తెలిసిందే. అదిగో ఇదిగో విలీనం అని ఢిల్లీ, బెంగళూరు వేదికగా పలుమార్లు చర్చలు జరిగినప్పటికీ చివరికి ఎందుకు ఆ ప్రక్రియ ఆగిపోయింది. దీంతో ఒంటరిగా పోటీచేయాలని హైకమాండ్ నిర్ణయం తీసుకుంది కానీ.. ఇంతలో ఏం జరిగిందో తెలియట్లేదు కానీ.. సడన్‌గా కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని షర్మిల నిర్ణయించారు. ఈ ప్రకటన చేసిన రోజుల వ్యవధిలోనే వైఎస్సార్టీపీకి ఊహించని షాక్ తగిలింది. పార్టీకి పలువురు కీలక నేతలు, ద్వితియ శ్రేణి నేతలు మూకుమ్మడిగా రాజీమా చేశారు. ఈ మేరకు సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ నేత గట్టు రామచంద్రరావు నేతృత్వంలో రాజీనామాలు చేసి, మీడియా మీట్ నిర్వహించారు.

**ఏం జరిగింది..?**

తెలంగాణ సమాజం నుంచి వైఎస్ షర్మిలను బహిష్కరించాలని.. తమను నట్టేట ముంచిందని రాజీనామా చేసిన నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. షర్మిల తెలంగాణలో తిరిగితే అడ్డుకుంటామని శపథం చేశారు. 'ఆంధ్ర షర్మిల.. గో బ్యాక్'



అంటూ నినాదాలు చేశారు. తెలంగాణ ప్రజలను మోసం చేసిన షర్మిల వెంటనే తెలంగాణను విడిచిపెట్టాలని నేతలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గట్టు రామచంద్రరావు మాట్లాడుతూ.. రాజశేఖర్ రెడ్డి పేరును షర్మిల చెడగొట్టారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కాంగ్రెస్‌లో నిలబడతా అని చివరగా అందరిని రోడ్డు మీద నిలబెట్టింది. ఇన్ని రోజులకు షర్మిలను సపోర్ట్ చేసినందుకు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెబుతున్నాం. మేమంతా షర్మిలను తెలంగాణ నుంచి బహిష్కరిస్తున్నాం. తెలంగాణ ప్రజలంటే షర్మిలకు చిన్నచూపు.. షర్మిల రాజకీయాలకు పనికిరాదు. భవిష్యత్ కార్యచరణ త్వరలోనే చెబుతాం' అని గట్టు చెప్పుకొచ్చారు.

**మోసం.. మోసం!**

మహిళా నేత సత్యవతి మాట్లాడుతూ.. వైఎస్సార్ అభిమానులను షర్మిల మోసం చేసిందని మండిపడ్డారు. మహిళలకు ప్రాధాన్యత ఇస్తామంటే పార్టీలో చేరి.. పాదయాత్రలో పాల్గొన్నానని చివరికి ఇలా జరగడం బాధాకరమన్నారు. 'వైఎస్సార్ కార్యకర్తలు అందరూ అభిమానంతో పార్టీలో చేరారు. నేతలు, కార్యకర్తలందర్నీ షర్మిల మోసం చేసింది. తెలంగాణ నుండి షర్మిలను బహిష్కరిస్తున్నాం. షర్మిల ఎవర్ని గౌరవించలేదు.. సొంత ఎజెండాతో ముందుకు వెళ్ళింది. పాదాల మీద కాదు.. మా అందరి శవాల మీద నడిచేందుకు సిద్ధమైంది. తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెబుతున్నాం. రాబోయే ఎన్నికల్లో షర్మిల ఎక్కడ పోటీ చేసినా ఓడిస్తాం' అని సత్యవతి చెప్పారు. మరో నేత గణేష్ నాయక్ మాట్లాడుతూ.. బయ్యారం గుట్టను దోచుకోవడానికి షర్మిల తెలంగాణ రాజకీయాల్లోకి వచ్చారని ఆరోపించారు. తెలంగాణ సొమ్మును దోచుకోవడానికి పార్టీ ఏర్పాటు చేశారని మండిపడ్డారు. షర్మిల తెలంగాణలో ఎక్కడ పోటీ చేసినా రాళ్లతో కొట్టి ఆంధ్రప్రదేశ్‌కు పంపుతామన్నారు. సంజీవ రావు మాట్లాడుతూ.. తెలంగాణలో షర్మిల ఎన్నో డ్రామాలు నడిపిందన్నారు. కాంగ్రెస్‌తో కుమ్మక్కై.. నేతలను రోడ్డుపైకి లాగారన్నారు. తెలంగాణ ద్రోహి షర్మిలకు తగిన గుణపాఠం చెబుతామని.. ఆమె రాష్ట్రంలో తిరిగి హక్కేలేదన్నారు.

**ఆందోళన వద్దు..**

కాగా మూకుమ్మడి రాజీనామాలు, కార్యకర్తలు, నేతలు ఆందోళన చెందుతున్న పరిస్థితుల్లో వైఎస్సార్టీపీ అధికార ప్రతినిధి నీలం రమేష్ ఓ ప్రకటన రిలీజ్ చేశారు. 'తెలంగాణ వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్టీపీ శ్రేణులు ఎటువంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదు. మన పార్టీ కేవలం ఎన్నికల్లో మాత్రమే పోటీ చేయలేదు. పార్టీ లేదని.. పార్టీని ఇక నడపరు అని జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి నిజం లేదు. ప్రజా వ్యతిరేక ఓటు చీలకూడదని, మళ్ళీ బీఆర్ఎస్ అధికారంలో రాకూడదని మన అధినేత్రి చేసింది త్యాగమే తప్ప.. మోసం కాదు. ఎన్నికల తర్వాత కొత్తగా ఏర్పడే ప్రభుత్వంపై ప్రజల కోసం పోరాటం ఉంటుంది. ప్రజల పక్షాన వైఎస్సార్ తనయ నిలబడుతుంది. ఈ అంశాలను గౌరవించి ఎవరు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అని ప్రకటనలో రమేష్ పేర్కొన్నారు.

# తోకచుక్కల శాస్త్రవేత్త హెలీ జయంతి (నవంబర్ 8)



హెలీ పేరు వినగానే తోకచుక్కలు గుర్తుకువస్తాయి. 17, 18వ శతాబ్దాలు విజ్ఞానవేషణలో విప్లవయుగం వంటిది. గెలీలియో, న్యూటన్ లాంటి శాస్త్రవేత్తల కారణంగా ఈ విశ్వం అర్థం పూర్తిగా మారిపోయింది. వారి స్ఫూర్తి మరెందరో శాస్త్రవేత్తల ను తయారుచేసింది. ఆ క్రమంలో ఎదిగిన మహనీయుడే హెలీ. ఈయన 1656 నవంబర్ 8న లండన్ దగ్గర్లో హగర్ స్టెన్ లో జన్మించారు. వీరి పూర్తిపేరు ఎడ్మండ్ హెలీ. ఖగోళశాస్త్రం, భూగర్భ శాస్త్రం, గణితం, భౌతిక శాస్త్రాలలో వీరు గొప్ప ప్రావీణ్యం సంపాదించారు. 300లకు పైగా నక్షత్రాలపై పరిశోధనలు చేశారు. తోక చుక్కల కక్ష్యలను లెక్కకట్టడమే కాదు మరెన్నో పరిశోధనలు చేశారు. 19 ఏళ్లకే ఖగోళశాస్త్రం పై ఆసక్తి పెంచుకుని కెప్లర్ సూత్రాలపై పుస్తకం రాసారు. ఈ పుస్తకాన్ని చూసిన బ్రిటన్ రాజస్థాన ఖగోళ శాస్త్రజ్ఞుడు జాన్ ఫ్లామ్ స్టీడ్ హెలీని ప్రోత్సహించారు. అప్పటికే ఫామ్ స్టీడ్ ఉత్తరార్ధ గోళంలో నక్షత్రాలపై పరిశోధనలు చేస్తుండడంతో హెలీ దక్షిణార్ధ గోళం పై దృష్టిసారించారు. 1676లో ఈస్టిండియా కంపెనీ ఓడలో సెయింట్ హెలీనా ద్వీపానికి బయలుదేరాడు. అక్కడే రెండేళ్ల తరువాత కొత్త నక్షత్రాలను కనిపెట్టారు. దక్షిణార్ధ గోళంలో 341 నక్షత్ర స్థానాన్ని, తన పరిశోధనల వివరాన్ని 1679 లో కేటలాగ్ ను ప్రచురించారు. దీంతో హెలీ పేరు ప్రపంచానికి తెలిసిపోయింది. రాయల్ సొసైటీ హెలీ ని ఆహ్వానించి సభ్యత్వమిచ్చింది. 1686లో రాయల్ సొసైటీ కి సెక్రటరీ గా ఎంపికై పత్రికా సంపాదకుడిగా వ్యవహరించారు. తాను సముద్రయానంలో ఉన్నప్పుడు వాతావరణం మార్పులు, గాలివాటం, రుతుపవనాలు, సముద్రపు నీరు తదితర అంశాలపై అనేక విషయాలను అధ్యయనం చేసిన సమాచారాన్ని 1686 ఏర్చికూర్చి ఒక పటం తయారుచేశారు. అదే తొలి మెట్రో లాజికల్ చార్ట్. మనం ఇప్పుడు ప్రసార మాధ్యమాల్లో చూస్తున్న వాతావరణ నివేదికలో కనిపించే ఆద్యుడు హెలీయే. 1531, 1607, 1682లో కనిపించిన తోక చుక్కల గమనాల్లో సారూప్యత కనిపించడం ఆయనను ఆకర్శించింది. ఈ మూడు వేర్వేరు కాదని ఒకే తోక చుక్కని ప్రపంచానికి తెలిపారు. అంతేకాదు 76 లేదా 77 సంవత్సరానికి ఒకసారి భూమికి సమీపంలోకి వస్తుందని,చెప్పారు. కంటికి కనిపిస్తుందని తెలిపారు. 1757లో వస్తోందని జోస్యం చెప్పారు. హెలీ ఊహించినట్లుగానే 1757లో వస్తుందని జ్యోషం చెప్పారు హెలీ ఊహించినట్లుగా 1757లో దర్శనమిచ్చింది. కానీ హెలీ అప్పటికి లేరు. ఇప్పుడా తోక చుక్కని హెలీ తోక చుక్కగా పిలుస్తున్నారు. 1986లో మళ్లీ ఓసారి కనిపించింది. తిరిగి 2061లో కనపడుతుంది. అంతేకాదు 1769లో సూర్యుడికి భూమికి మధ్యదూరాన్ని కొలిచేందుకు మార్గదర్శనం చేశారు. ఈ దూరాన్ని 93 మిలియన్ మైళ్ళుగా అంచనా వేశారు. భూమి వయసు, ఇంద్ర ధనస్సు లోని వర్ణాలు మొదలైన విషయాలను పరిశోధించారు. గణిత శాస్త్ర సూత్రాలను కనుగొన్నారు. ఈ విధంగా హెలీ చరిత్ర పుటల్లో మిగిలారు. వీరు 1742 జనవరి 14 న మరణించారు.

డా.జె.వి.ప్రమోద్ కుమార్
పైడిమెట్ట 9490833108

# స్కీమ్‌లు లేవు - స్కాములే

## చంద్రబాబు పాలనపై జగన్ నిప్పులు
## రైతు భరోసా నిధుల విడుదల



శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఇవాళ వరుసగా ఐదో ఏడాది వైఎస్సార్ రైతు భరోసా పథకం రెండో విడత నిధుల్ని సీఎం వైఎస్ జగన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా విపక్షాలపై వైఎస్ జగన్ నిప్పులు చెరిగారు. చంద్రబాబుకు అధికారం ఎందుకు కావాలంటే తనతో పాటు ఓ గజదొంగల ముఠా కోసమేనని జగన్ తెలిపారు. ఎల్లో మీడియాకు తోడు దత్తపుత్రుడితో కలిపి గజ దొంగల ముఠాకు అధికారం కావాల్సింది రాష్ట్రాన్ని దోచుకోవడం కోసమేనన్నారు. వారి హయాంలో చంద్రబాబు పేరు చెబితే కనీసం ఒక్క మంచి పథకం గుర్తుకొస్తుందా అని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో ప్రజలు, పేదలు, విద్యార్థుల కంటే కూడా స్కాముల గురించే ఆలోచనలు జరిగాయన్నారు. స్కిల్ స్కాం, ఫైబర్ గ్రిడ్, మద్యం, ఇసుక, రాజధాని భూములు వంటి స్కాములు చోటుచేసుకున్నాయన్నారు.

గత నాలుగున్నరేళ్ల పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు తాము ఇచ్చిన పదవులు, గౌరవాల్ని, తాజాగా సామాజిక సాధికారిక యాత్రల్లో వారిని జనంలోకి ఎలా పంపుతున్నారో జగన్ వివరించారు. అదే సమయంలో రైతుల విషయంలో చంద్రబాబు పాలనకూ, తన పాలనకూ తేడా తెలుసుకోవాలని కోరారు. గత నాలుగున్నరేళ్ల కాలంలో రైతులకు తమ ప్రభుత్వం చేసిన సాయాన్ని చంద్రబాబు ప్రభుత్వం ఎందుకు చేయలేకపోయిందో నిలదీయాలని సీఎం జగన్ సూచించారు. రైతులకు 70 శాతంగా ఉన్న రైతన్నలకు రైతు భరోసా కింద పెట్టుబడి సాయంగా రూ.13500 ఇవ్వకపోతే వారు ఎలా బతుకుతారని గతంలో ఎప్పుడూ ఎవరూ ఆలోచన చేయలేదన్నారు. అందుకే ఏటా 53 లక్షల పైచిలుకు రైతులకు, కౌలు రైతులకు, గిరిజన రైతులకు ఏటా రూ.13500 చొప్పున ఇస్తున్నట్లు జగన్ తెలిపారు. గతంలో చంద్రబాబుకు రైతులకు మంచి చేయాలన్న ఆలోచన ఎందుకు రాలేదన్నదీ ఆలోచన చేయాలన్నారు.

విత్తనం నుంచి పంట అమ్మకం వరకూ గతంలో ఎప్పుడైనా చూశారా అని జగన్ ప్రశ్నించారు. 10 వేలకు పైగా రైతు భరోసా కేంద్రాలు ఇప్పుడు ఆ పని చేస్తున్నాయన్నారు. గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు ఈ పనులు చేయలేకపోయారో రైతులు ఆలోచించాలన్నారు. పగటి పూట 9 గంటలకు రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తున్న ప్రభుత్వం కూడా తమదేనని జగన్ తెలిపారు. గతంలో పగలు, రాత్రి కలిపినా ఏడు గంటలు కూడా వ్యవసాయానికి కరెంటు ఇవ్వలేదన్నారు. వ్యవసాయ ఫీడర్ల సామర్థ్యం ఎందుకు పెంచలేదో ఆలోచించాలన్నారు.

చంద్రబాబు హయాంలో ఐదేళ్ల పాటు కరువుంటే, తన ప్రభుత్వంలో నాలుగేళ్ల పాటు పుష్కలంగా వర్షాలు పడ్డాయని జగన్ గుర్తుచేశారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం రైతులకు బీమా సొమ్ము కేవలం 3 వేల కోట్లు మాత్రమే ఇచ్చిందని, తమ ప్రభుత్వంలో ఎన్నో రెట్లు ఎక్కువగా ఇచ్చిందన్నారు. కరవు రావడం తమ చేతుల్లో లేకపోయినా వచ్చినప్పుడు రైతుల్ని ఆదుకోవడం మన చేతుల్లోనే ఉంటుందన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో పంటనష్టం ఇస్తున్న ప్రభుత్వం తమదేనన్నారు.

అదే రాష్ట్రం, అదే బడ్జెట్ ఉందని, కేవలం మారింది ముఖ్యమంత్రేనని జగన్ గుర్తుచేశారు. అప్పుల రేటు కూడా గతంలో కంటే తగ్గిందన్నారు. బటన్ నొక్కగానే నేరుగా 2లక్షల 40 వేల కోట్లు అక్కాచెల్లెళ్ల ఖాతాల్లోకి వెళ్లాయన్నారు. కానీ చంద్రబాబు హయాంలో ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. ఆ డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో ఆలోచించాలన్నారు. తాను చెప్పేవని నిజాలన్నారు. తాను ఎల్లో మీడియాను నమ్ముకోలేదని, దేవుడిని మాత్రమే నమ్ముకున్నట్లు తెలిపారు. అబద్ధాల్ని నమ్మొద్దని ప్రజల్ని కోరారు. రాబోయే రోజుల్లో చంద్రబాబు సైన్యం వచ్చి మోసం చేసే మాటలు చెబుతుందన్నారు. ఇంటికి కేజీ బంగారం ఇస్తాం, బెంజికారు ఇస్తామంటారన్నారు. వాటిని నమ్మొద్దన్నారు.

## సుక్మా పోలీస్‌స్టేషన్ సమీపంలో భద్రతా సిబ్బందిపై నక్సల్స్ కాల్పులు

దక్షిణ్ బస్తర్ దంతెవాడ, నవంబర్ 7: ఛత్తీస్‌గఢ్‌లో మొదటి దశ పోలింగ్‌లో ఓటింగ్ కొనసాగుతుండగా, రాష్ట్రంలోని బండా పోలింగ్ స్టేషన్ సమీపంలో మోహరించిన డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి) సిబ్బందిపై నక్సల్స్ కాల్పులు జరిపినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. భద్రతా బలగాలు ప్రతీకారం తీర్చుకున్నాయని, నక్సల్స్ దాడిని ఆపడానికి ముందు పది నిమిషాల పాటు ఎదురుకాల్పులు జరిగాయని సుక్మా పోలీసులు తెలిపారు.

ఔటర్ కార్డన్‌లో సిబ్బందిని విధుల కోసం నియమించారు

బండ పోలింగ్ రాష్ట్రానికి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఔటర్ కార్డన్‌లో సిబ్బందిని విధుల కోసం నియమించారు. జవాన్లందరూ సురక్షితంగా ఉన్నారని, ఓటింగ్ ఇంకా కొనసాగుతోందని వారు తెలిపారు. నేటి పోలింగ్‌లో ఓటింగ్ జరిగిన 20 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పలు జిల్లాలు నక్సల్స్ ప్రాబల్యంతో ఉన్నాయి.

రాష్ట్రంలో, 12 మంది బస్తర్ డివిజన్ నుండి ఉన్నారు.

నక్సల్స్ ప్రభావిత నియోజకవర్గాల్లో ఓటింగ్ జరుగుతోంది

బస్తర్, దంతేవాడ, కంకేర్, కబీర్‌ధామ్, రాజ్‌నంద్‌గావ్ వంటి జిల్లాల్లో నక్సల్ ప్రభావిత నియోజకవర్గాల్లో ఓటింగ్ జరుగుతోంది. భారత ఎన్నికల సంఘం ప్రకారం ఉదయం4గంటల వరకు ఛత్తీస్‌గఢ్‌లో 49.97 శాతం ఓటింగ్ నమోదైంది. డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరగనుంది.












## వైకాపా ప్రభుత్వ కక్ష సాధింపులకు చెక్ పెట్టండి: గవర్నర్‌కు తెదేపా నేతల విజ్ఞప్తి

విజయవాడ: జగన్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు, చేస్తోన్న సామాజిక అన్యాయంపై తెదేపా నేతలు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు ఫిర్యాదు చేశారు. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, పీతల సుజాతతో పాటు నేతలు ధూళిపాళ్ల నరేంద్ర, అశోక్‌బాబు తదితరులు విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు.

రాష్ట్రంలో గత 53 నెలల వైకాపా ప్రభుత్వ అరాచక పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరిగాయంటూ గవర్నర్‌కు లోకేశ్ వివరించారు. బీసీ వర్గానికి చెందిన అమర్నాథ్ గౌడ్ నోట్లో పేపర్లు కుక్కి, పెట్రోల్ పోసి వైకాపా నేతలు తగులబెట్టారన్నారు. దళిత వర్గానికి చెందిన శ్యామ్‌కుమార్‌పై దాడి చేసి మూత్రం పోసిన ఘటననూ గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి ఆయనకు వివరించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రతిపక్షాలపై జగన్ ప్రభుత్వం సాగిస్తున్న కక్ష సాధింపు చర్యలను గవర్నర్‌కు నేతలు నివేదించారు. వాలంటీర్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు అడ్డుకట్ట వేసేలా రూపొందించిన 17ఏ సెక్షన్‌ను సైతం తుంగలో తొక్కి.. గవర్నర్ వ్యవస్థను కూడా గౌరవించకుండా జగన్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును నేతలు వివరించారు. ఎటువంటి ఆధారాలు లేకపోయినా చంద్రబాబును 53 రోజుల పాటు జైలులో నిర్బంధించిన విధానాన్ని లోకేశ్, అచ్చెన్నాయుడు తదితరులు గవర్నర్‌కు నివేదించారు. వైకాపా ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు చెక్ పెట్టేలా రాజ్యాంగంలోని ఆర్టికల్ 355 ప్రకారం రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని తెదేపా నేతల బృందం ఆయనకు విజ్ఞప్తి చేసింది.

## వక్ఫ్ బోర్డును జగన్ ప్రభుత్వం అపవిత్రం చేసింది



అమరావతి: వక్ఫ్ భూములు, ఆస్తులను వైసీపీ ప్రభుత్వం, అధికార పార్టీ పెద్దలు చెరబడుతున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు మొహమ్మద్ షరీఫ్ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా వక్ఫ్ బోర్డు నియామకం గురించి ఆలోచించని జగన్ సర్కార్ ఇప్పుడు తన పార్టీ వారిని, అనర్హుల్ని బోర్డు సభ్యులుగా నియమించడం ముమ్మాటికీ వక్ఫ్ ఆస్తుల దోపిడీ కోసమే అని ఆరోపించారు. ఒక వక్ఫ్ బోర్డు సభ్యుడి ఎంపిక కోసం అధికార పార్టీ నేతలు, మైనారిటీ శాఖ మంత్రి అంజాద్ బాషా రంగంలోకి దిగి ఒత్తిళ్లు చేసి, పైరవీలు నడిపారని ఆయన అన్నారు.

పవిత్రంగా అల్లాహ్ సేవలో ధర్మబద్ధంగా పనిచేయాల్సిన వక్ఫ్ బోర్డుని దోపిడీ కోసం జగన్ ప్రభుత్వం అపవిత్రం చేసిందని విమర్శించారు. వక్ఫ్ బోర్డు ఏర్పాటు... ముస్లిం మైనారిటీల సంక్షేమంలో గానీ టీడీపీ ప్రభుత్వం నిష్పక్షపాతంగా, నిబంధనల ప్రకారం వ్యవహరించిందన్నారు. గతంలో అన్యాక్రాంతమైన దాదాపు 300 ఎకరాల వక్ఫ్ భూములను టీడీపీ ప్రభుత్వం కాపాడిందని తెలిపారు. వక్ఫ్ భూములు కాజేయాలని చూస్తున్న వైసీపీ నేతలకు సహకరిస్తున్న అధికారులను కచ్చితంగా శిక్షంపబడతారన్నారు. టీడీపీ ప్రభుత్వం రాగానే వక్ఫ్ భూములు అన్యాక్రాంతంపై జ్యుడిషియరీ విచారణ జరిపించి.. వక్ఫ్ భూములు కాజేసిన వారిని, వారికి సహకరించిన వారిని కఠినంగా శిక్షిస్తుందని హెచ్చరించారు. ముస్లిం మైనారిటీల పథకాలు రద్దు చేసి.. చివరకు వక్ఫ్ ఆస్తుల్ని కూడా కబళించాలని చూస్తున్న జగన్ రెడ్డి ప్రభుత్వాన్ని ముస్లిం సమాజం కఠినంగా శిక్షించాలని మొహమ్మద్ షరీఫ్ కోరారు.

## 133 ల్యాప్‌టాప్‌లు, 19 ఫోన్లు చోరీ.. మాజీ ఐటీ ఉద్యోగి అరెస్టు



బెంగళూరు, (విశాఖ సమాచారమ్): ప్రముఖ ఐటీ నగరం బెంగళూరులో ఐటీ ఉద్యోగులు ఉండే ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని చోరీకి పాల్పడుతున్న నిందితుడు పోలీసులకు చిక్కాడు. ఐటీ ఉద్యోగుల పేయింగ్ గెస్ట్ వసతి గృహాల నుంచి 133 ల్యాప్‌టాప్‌లు, 19 మొబైల్ ఫోన్లు, నాలుగు ట్యాబ్‌లను చోరీ చేసిన కేసులో ఓ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు కంప్యూటర్ సైన్స్ గ్రాడ్యుయేట్ అని.. గతంలో ఒక ఐటీ కంపెనీలో ఉద్యోగం చేసినట్టు పోలీసులు గుర్తించారు. చోరీ చేసిన ఈ ఎలక్ట్రానిక్ పరికరాల విలువ దాదాపు రూ.75లక్షలు ఉంటుందని బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ బి.దయానంద వెల్లడించారు. గతంలో ఓ ఐటీ కంపెనీలో పనిచేసిన ఈ నిందితుడు.. పేయింగ్ గెస్ట్, బ్యాచిలర్ వసతి గృహాలకు తరచూ వెళ్లడం.. అక్కడి నుంచి ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు మాయం చేసేవాడని తెలిపారు. అతడు చోరీ చేసిన ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లి మార్కెట్లో విక్రయించిన మరో ఇద్దరిని సైతం అదుపులోకి తీసుకున్నట్లు దయానంద తెలిపారు. ఆ ముగ్గురూ ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నట్లు తెలిపారు. సెంట్రల్ డివిజన్‌లో ఎనిమిది కేసులు గుర్తించామని.. మిగతా పోలీస్ స్టేషన్‌లలో ఈ తరహా కేసులను పరిశీలిస్తున్నట్లు దయానంద తెలిపారు.

మరోవైపు, బెంగళూరులోని సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు బెట్టింగ్ రాకెట్‌ను ఛేదించారు. 11 చోట్ల దాడులు చేసి 13 మందిని అరెస్టు చేశారని దయానంద తెలిపారు. వ్యవహారంలో 11 కేసులు నమోదు చేసి.. నిందితుల నుంచి రూ.10లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.






VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Simhachalam : Cell: 96660 15921, Pardwada : Cell: 77804 33919, ,
Cheedikaada : Cell: 97686 33999, Vsp City : 8885687610, VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776, Yelamanchili : 9441356676